
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 06-08-2025
Medchal - Malkajgiri । Wednesday 06-08-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 73 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 73 । Pages : 8 । ₹: 5

నటుడు రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగష్టు 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. వరుస ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్రయూనిట్. ఈ మూవీ నుంచి 'ఓలే ఓలే' అనే పాటను విడుదల చేసింది చిత్రయూనిట్. భాస్కర్ యాదవ్ దాసరి సాహిత్యం అందించిన ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించడంతో పాటు రోహిణి సోరట్‌తో కలిసి పాడారు.






# బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి..!

**ప్రతిపక్షానికి ఎక్కడా ఛాన్స్ ఇవ్వకుండా దెబ్బ మీద దెబ్బ కొడుతుంది అధికార పక్షం. మొన్న ఫోన్ ట్యాపింగ్, తాజాగా కాళేశ్వరం కమిషన్ అంటూ.. ముప్పేట దాడితో.. బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరవుతుంది. ఇదే అదునుగా ప్రత్యర్థి బీజేపీ సైతం తన పావులు కదుపుతోంది. ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో గులాబీ నేతలకు గాలం వేసింది.**

**జయభేరి, హైదరాబాద్ :**

ప్రతిపక్షానికి ఎక్కడా ఛాన్స్ ఇవ్వకుండా దెబ్బ మీద దెబ్బ కొడుతుంది అధికార పక్షం. మొన్న ఫోన్ ట్యాపింగ్, తాజాగా కాళేశ్వరం కమిషన్ అంటూ.. ముప్పేట దాడితో.. బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరవుతుంది. ఇదే అదునుగా ప్రత్యర్థి బీజేపీ సైతం తన పావులు కదుపుతోంది. ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో గులాబీ నేతలకు గాలం వేసింది.

తెలంగాణలో బీఆర్ఎస్‌కు గడ్డు కాలం నడుస్తుంది. ఒకవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు కొనసాగుతుండగానే, కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ రూపంలో బీఆర్ఎస్‌పై మరో పిడుగు పడింది. నేడో, రేపో స్థానిక ఎన్నికలంటూ హీట్ కొనసాగుతున్న వేళ.. వరుసగా బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టే అంశాలతో పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ముప్పేట దాడి కారణంగా.. తెలంగాణలో బర్నింగ్ టాపిక్ అయినటువంటి బీసీ రిజర్వేషన్ అంశంపై ఫోకస్ చేయలేకపోతుంది బీఆర్ఎస్.

నిన్న మొన్నటి వరకు ఈ కార్ రేసింగ్, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల పంపిణీ కేసులంటూ ఎటాకింగ్‌కు దిగిన కాంగ్రెస్.. తాజాగా కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను ప్రజల ముందుంచింది. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌లో బీఆర్ఎస్ పెద్ద తలకాయలను టార్గెట్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్, హరీష్‌రావు పేర్లు ప్రస్తావించింది కమిషన్. దీంతో.. రివర్స్ ఎటాక్‌కు దిగింది బీఆర్ఎస్. అది కమిషన్ రిపోర్ట్ కాదు..

...మిగతాది 2 లో

# కుట్ర పూరితంగానే కాళేశ్వరం కమిషన్ విచారణ



- **మొబిలైజేషన్ అడ్వాన్లు పేరుమీద రూ. 2 వేల కోట్లు దొబ్బారు**
- **మాజీ మంత్రి హరీష్ రావు**

**జయభేరి, హైదరాబాద్:**

రేవంత్ పాలన గాలికొదిలేశారు. రేవంత్ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు . విద్యార్థులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. వాస్తవాలు లేకుండా వండి వార్చిన రిపోర్ట్ బయటపెట్టారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.మంగళవారం నాడు తెలంగాణ భవన్ లో ఆయన పిపిటి ప్రజంటేషన్ ఇచ్చారు. హరీష్ రావు మాట్లాడుతూ.. బిల్లు కావాలంటే 1012 శాతం కమీషన్లు కావాలి. బీజేపీ, కాంగ్రెస్లు కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. గోదావరి నదిపై పోలవరం ప్రాజెక్టు 3 సార్లు కుప్పకూలిందని అన్నారు. మాకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇస్తున్నారు. కుట్ర పూరితంగానే కమిషన్ విచారణ జరిగినట్లు కనిపిస్తోంది. అసెంబ్లీలో 665 పేజీల రిపోర్ట్ పెడితే ప్రభుత్వాన్ని నిలదీస్తాం . వాస్తవాలను ప్రజల ముందుంచుతామని అన్నారు. 665 పేజీల నివేదికలో నచ్చిన అంశాలపై బయటపెట్టారు. ఒక వైపే చూసి, విని, నిలబడి ఇచ్చిన రిపోర్ట్ ఇది. ఇది బేస్లెస్ రిపోర్ట్. దేశంలో ఎన్నో కమిషన్లు వేశారు.. న్యాయస్థానాల ముందు నిలబడవు.

...మిగతాది 2 లో

# గ్రామాన్ని ముంచేసిన వరద

- **60 మంది గల్లంతు..**



**హిమాలయాల్లో భారీ వర్షా లకు కొండచరియలు విరిగి పడి ఊళ్లకు ఊళ్లనే ముంచేశాయి. ఇప్పటికే సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. ఈ దృశ్యాలు చూస్తుంటే ఒక్కసారిగా గుండె ఆగినంత పని అవుతుంది. మనకే అలా ఉంటే... స్పాట్‌లో ఉన్నవాళ్ల పరిస్థితి ఏంటో ఓసారి ఊహించుకోండి. జలప్రళయం ఒక్కసారిగా మెరుపు వేగంతో దూసుకొచ్చింది. వందల ఇళ్లు కనుమరుగు అయ్యాయి.**

**జయభేరి, ఉత్తరాఖండ్ :**

ఉత్తరాఖండ్ ఉత్తర్‌కాశీ జిల్లా ధరాలీ గ్రామంలో ఘోర విషాదం చోటుచేసుకుంది.. క్లౌడ్ బరస్ట్‌తో మెరుపు వరదలు గ్రామాన్ని ముంచేత్తాయి.. ఖీర్ గంగా నది భారీ ఎత్తున ఉప్పొంగింది.. దీంతో చాలా మంది వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు.. పదుల సంఖ్యలో గృహాలు వరద బురద మేట కింద కూరుకుపోయారు. చాలా మంది గల్లంతయ్యాయరని.. శిథిలాల్లో మరికొందరు చిక్కుకున్నారని.. అధికారులు పేర్కొంటున్నారు. వెంటనే ఘటనాస్థలానికి సహాయ బృందాలను తరలించారు. ఇప్పటి వరకు 60 మందికిపైగా

...మిగతాది 2 లో



# జపాన్‌ను అధిగమించిన ఇండియా..!

**భారతదేశ విమానయాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది, 2024లో 241 మిలియన్ల మంది ప్రయాణికులను నమోదు చేసింది. దేశీయ ప్రయాణాల పెరుగుదల, ముఖ్యంగా ముంబైఢిల్లీ మార్గం రద్దీని పరిగణనలోకి తీసుకుంటే, ఈ వృద్ధికి కారణం. ప్రపంచవ్యాప్తంగా పోటీ ఉన్నప్పటికీ, భారతదేశం అధిక వృద్ధి రేటును నమోదు చేస్తుంది.**

**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 5:**

భారతదేశ విమానయాన రంగం వేగంగా దూసుకుపోతోంది. ప్రపంచంలో ఐదవ అతి పెద్ద విమానయాన మార్కెట్‌గా తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటోంది. 2024లో భారతదేశం 241 మిలియన్ల మంది ప్రయాణికులను నిర్వహించి, అంతకుముందు సంవత్సరం కంటే 11.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది జపాన్ వంటి అభివృద్ధి చెందిన మార్కెట్‌లను కూడా అధిగమించింది. ఈ వృద్ధికి ప్రధాన కారణం దేశీయ ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడం. దీనికి ఉదాహరణ ముంబై ఢిల్లీ మార్గం ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే మార్గాలలో ఒకటిగా నిలిచి, దాదాపు 6 మిలియన్ల ప్రయాణికులకు సేవలు అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా యునైటెడ్ స్టేట్స్, చైనా, యునైటెడ్ కింగ్‌డమ్, స్పెయిన్ వంటి విమానయాన దిగ్గజాలతో భారత్ పోటీపడుతోంది. తమ విస్తారమైన దేశీయ మార్కెట్ల కారణంగా అమెరికా, చైనా స్పష్టమైన ఆధిక్యతలో ఉన్నాయి. అయితే భారత్ వృద్ధి రేటు చాలా అభివృద్ధి చెందిన మార్కెట్ల కంటే ఎక్కువగా ఉంది. దేశీయ ప్రయాణాల ప్రాముఖ్యత

...మిగతాది 2 లో



# సిలిండర్ పేలి కూలిన ఇల్లు

- **ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు**

**మేడ్చల్ పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహ సమీపంలో ఉన్న ప్రధాన కూడలి వద్ద మాజీ ఎంపీటీసీ మురళి ఇంటిలో సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న ఒకరు మృతి చెందగా మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి...**

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహ సమీపంలో ఉన్న ప్రధాన కూడలి వద్ద మాజీ ఎంపీటీసీ మురళి ఇంటిలో సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న ఒకరు మృతి చెందగా మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం, మురళి ఇంటి కింద భాగంలో పూల దుకాణం ఉంది. ఈ దుకాణంలోనే సిలిండర్ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. పేలుడు ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఉన్న ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని వెంటనే స్థానికులు మరియు పోలీసులు సహాయంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ ఒకరు చనిపోగా మరొక మహిళ చికిత్స పొందుతోంది. సిలిండర్ పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్ వల్ల పేలుడు జరిగిందా, లేక గ్యాస్ లీకేజీ వల్ల జరిగిందా అనేది పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇందిరమ్మ ప్రభుత్వంలో విద్యా, వైద్యానికి పెద్దపీట



**జయభేరి, ఏదులాపురం :**

యంగ్ ఇండియా స్కూళ్లతో కొత్త విద్యా యుగానికి నాంది" పలుకుతున్నట్లు రాష్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 191 మంది బాలికలకు సైకిళ్లను జిల్లా కలెక్టర్ అనదీప్ దూరిశెట్టి తో కలిసి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏదులాపురం మున్సిపాలిటీ, 1వ, 59వ, 60వ డివిజన్లతో పాటు రూరల్ మండలానికి చెందిన

...మిగతాది 2 లో



# నిజమైన భారతీయుడిని తేల్చేది జడ్జీలు కాదు


**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 5:**

నిజమైన భారతీయుడిని తేల్చేది జడ్జీలు కాదు అని రాహుల్ గాంధీ సోదరి ప్రియాంకా గాంధీ స్పందించారు. చైనా మన భూభాగాన్ని ఆక్రమించినట్లు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సోమవారం సుప్రీంకోర్టు సీరియస్ అయిన విషయం తెలిసిందే. నిజమైన భారతీయులు అలా మాట్లాడరు అని కోర్టు ఆ కేసులో పేర్కొన్నది. కోర్టు చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఇవాళ పార్లమెంట్ ఆవరణలో అడిగిన ఓ ప్రశ్నకు ఆమె బదులిస్తూ రాహుల్‌ను సమర్థించారు. ప్రశ్నలు వేయడం, ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్ష నేత విధి అని ఆమె అన్నారు. నిజమైన భారతీయులు కాదా అన్న స్టేట్మెంట్‌పై మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థ పట్ల పూర్తి గౌరవం ఉందని, రాహుల్ గాంధీ సైన్యాన్ని, సైనికులను ఎల్లప్పుడూ గౌరవించారని ఆమె పేర్కొన్నారు.

**తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి PPT ప్రెజెంటేషన్**

3 పేజీ

**ట్రంప్ తెంపరితనం**



...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి..!

కాంగ్రెస్ రిపోర్ట్ అని స్వయంగా కేసీఆరే విమర్శించారు. అంతేకాదు.. కమిషన్ రిపోర్ట్ పేరుతో జరిగే డ్యామేజీని కంట్రోల్ చేసేందుకు నాయకుల్ని రంగంలోకి దింపారు. ఇందులో భాగంగానే ఇవాళ హరీష్‌రావు ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నారు. కమిషన్ పూర్తి రిపోర్ట్ బయట పెట్టకుండా.. కేసీఆర్ మీద నిందలు మోపడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శిస్తున్నారు. మరోవైపు.. కాంగ్రెస్ ఎటాక్‌తో ఇబ్బందుల్లో ఉన్న బీఆర్ఎస్‌ను బీజేపీ కూడా దెబ్బ కొడుతుంది. బీఆర్ఎస్ లాయలిస్టులకు గాలాలు వేసి.. బీజేపీలో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నల్లమల ప్రాంతానికి చెందిన గువ్వల బాలరాజును తమ దారికి తెచ్చుకోవడంలో సక్సెస్ అయ్యారు. రేపో, మాపో గువ్వల బీజేపీ కండువా కప్పుకోబోతున్నారు. ఒక్క గువ్వలే కాదు.. మరికొందరు గులాబీ నేతలు కూడా బీజేపీలోకి రావడం గ్యారంటీ అంటున్నారు రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు. అధికార కాంగ్రెస్ ముప్పేట దాడితో సతమతం అవుతున్న బీఆర్ఎస్‌కు,.. బీజేపీ కంట్లో నలుసుగా మారింది. ఎప్పుడు ఏ నాయకుడికి ఎర వేస్తుందనే టెన్షన్‌లో ఉన్నారు గులాబీ నేతలు. ఏదేమయినా.. కాంగ్రెస్, బీజేపీ వ్యూహాలకు బీఆర్ఎస్‌పై కారు మేఘాలు కమ్మాయి. దీంతో.. రెండు పార్టీలకు స్ట్రాంగ్ కౌంటర్స్ ఇస్తూ.. ప్రజలకు వాస్తవాలు వివరించే ప్రయత్నం చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. మరోవైపు బీసీ కోటాపై బీఆర్ఎస్ స్టాండ్‌ను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతుంది.

## కుట్ర పూరితంగానే కాళేశ్వరం కమిషన్ విచారణ

గతంలోనూ ఎంతో మంది రాజకీయ నేతలపై కమిషన్లు వేశారు. సీఎం రేవంత్ వరుస సీరియళ్లు నడుపుతున్నారు . కేసీఆర్ను హింసించాలన్నదే రేవంత్ ఉద్దేశమని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో తమ్మిడిహట్టి దగ్గర దమ్మిడు మట్టి ఎందుకు వేయలేదు. తమ్మిడిహట్టి దగ్గర నీటి లభ్యత లేదు. జీవ సంపద ఉంది, మహారాష్ట్ర నుంచి అభ్యంతరాలు ఉన్నాయి. అందుకే అక్కడ ప్రాజెక్ట్ కట్టలేదు. కన్నేపల్లి దగ్గర మోటార్లు ఆన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు ధర్నా చేశారు. రెండేళ్ల నుంచి ఎందుకు తట్టెడు మట్టి ఎత్తలేదు. కేసీఆర్ మహారాష్ట్రలో చారిత్రాత్మక ఒప్పందం చేసుకున్నారు. కేసీఆర్ ఒకేసారి మూడు అగ్రిమెంట్లు చేశారని అన్నారు. 152 మీటర్లకు అగ్రిమెంట్ చేస్తే ఎలా తగ్గిస్తారని ఉత్తమ్ అన్నారు. ఇంకా గంట 40 నిమిషాలు బేగంపేట ఎయిర్పోర్టులో ఉంటా. 152 మీటర్లకు ఒప్పుకున్నట్టు ఉత్తమ్ అగ్రిమెంట్ పత్రం తీసుకొస్తే. ఇక్కడి నుంచి రాజ్భవన్కు వెళ్లి రాజీనామా చేస్తానని కేసీఆర్ సవాల్ విసిరారు. ఒక్క ఏడాదిలోనే 24 గంటల కరెంటు ఇచ్చారు. మిషన్ కాకతీయతో చెరువులను పునఃరుద్ధరించారు. పెండింగ్ ప్రాజెక్టను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం . నువ్వు వచ్చినంక ఒక్క కాలువ తవ్విన, ఒక్క ఎకరానికి నీళ్లు ఇచ్చావా అని ప్రశ్నించారు. రెండేళ్లలో ఢిల్లీకి కమీషన్ల మూటలు తీసుకెళ్లావు. వచ్చే రెండేళ్లలో కూడా రేవంత్రెడ్డి చేసేదేమీలేదు. ఢిల్లీకి కమీషన్ల ముఠాలు తీసుకెళ్లారు తప్ప చేసిందేమీ లేదు. కాటన్ బ్యారేజీ కట్టినా కమిషన్ వేసి వేధించారు. అయినా కాటన్ గోదావరి ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారు. కేసీఆర్కు కూడా తెలంగాణ ప్రజల గుండెల్లో దేవుడిలా నిలిచిపోతారు. కాళేశ్వరం ముమ్మాటికీ వర ప్రదాయినే, రేవంత్కు కూడా తెలుసు . కాళేశ్వరం కూలిందన్నోడు గంధమల్లకు కొబ్బరికాయ ఎట్ల కొడుతాడు. మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తీసుకొస్తానని చెబుతున్నాడు. కేసీఆర్ చేసింది వందేళ్ల భవిష్యత్ను దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం నిర్మాణం. ఉత్తమ్కుమార్రెడ్డి సత్యహరిశ్చంద్రుడికి తమ్ముడి లెక్క మాట్లాడుతున్నారు. ప్రాణహితచేవెళ్లలో పెట్టిన ఖర్చు రూ. 3,700 కోట్లు మాత్రమే. రూ. 11 వేల కోట్లు ఖర్చు చేశామని ఉత్తమ్ చెబుతున్నాడు. మొబిలైజేషన్ అడ్వాన్లు పేరుమీద రూ. 2 వేల కోట్లు దొబ్బారని ఆరోపించారు.

## జపాన్‌ను అధిగమించిన ఇండియా..!

భారతదేశంలో ఒక నిర్మాణ మార్పును సూచిస్తుంది. విమాన ప్రయాణం దేశంలోని విస్తారమైన భౌగోళిక ప్రాంతాలలో ప్రయాణించడానికి మరింత సులభంగా, ముఖ్యమైనదిగా మారుతోంది. ఆసియాపసిఫిక్ ప్రాంతం ప్రపంచ విమాన మార్గాలలో ఆధిపత్యం చెలాయిస్తోంది, అంతర్జాతీయ, ప్రాంతీయ అనుసంధానంలో భారతదేశం, ప్రాముఖ్యత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచంలో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయ జంటలలో చాలా వరకు ఇతర ఆసియాపసిఫిక్ దేశాలలో ఉన్నప్పటికీ, భారతదేశం, దేశీయ ప్రధాన మార్గాలు ప్రపంచ స్థాయిలో తమ ప్రాముఖ్యతను చాటుకుంటున్నాయి, ఇది మరింత అంతర్జాతీయ విస్తరణ, మెరుగైన అనుసంధానానికి వేదికగా నిలుస్తోంది. భారత్‌లో ప్రీమియంక్లాస్ ప్రయాణం – ప్రపంచ ట్రెండ్‌లకు అనుగుణంగా – పెరుగుతోంది. కానీ ఇది మొత్తం ప్రయాణికులలో చిన్న వాటా మాత్రమే. ఇది ఎకానమీక్లాస్ ప్రయాణికుల పెరుగుదలను నొక్కి చెబుతుంది. ప్రాంతీయ డేటా ప్రకారం, భారతదేశం, ఆసియాపసిఫిక్ ప్రాంతంలో భాగంగా, ముఖ్యంగా బలమైన ప్రీమియం, ఎకానమీ వృద్ధిని చూస్తోంది, ఇది ఆర్థిక శ్రేయస్సు పెరిగే కొద్దీ ఖర్చు చేయడానికి ఎక్కువ సుముఖతను సూచిస్తుంది. విమానాల విషయానికి వస్తే, భారతదేశంలోని విమానయాన సంస్థలు తమ స్వల్ప, మధ్యశ్రేణి కార్యకలాపాల కోసం బోయింగ్ 737 మరియు ఎయిర్‌బస్ A320 వంటి సమర్థవంతమైన, నారోబాడీ మోడళ్లను ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. ఈ ప్రాధాన్యత భారతదేశం రూట్ నెట్‌వర్క్ అవసరాలకు సరిపోతుంది, ఇది రద్దీగా ఉండే, అధికఫ్రీక్వెన్సీ నగర జంటలచే ఆధిపత్యం చెలాయిస్తుంది.

## గ్రామాన్ని ముంచేసిన వరద

గల్లంతు అయ్యారని.. పేర్కొంటున్నారు. వీరిలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో తెలియలేదు. ఉత్తరకాశిలోని హర్సిల్ ప్రాంతంలోని ఖీర్ గఢ్ నీటి మట్టం పెరగడం వల్ల, ధరాలిలో అపారనష్టం వాటిల్లిందని.. దీంతో పోలీసులు, ఎస్‌డిఆర్ఎఫ్, సైన్యం, ఇతర విపత్తు ప్రతిస్పందన బృందాలు సంఘటన స్థలంలో సహాయ కార్యకలాపాలలో నిమగ్నమయ్యాయని.. ఉత్తరకాశి పోలీసులు తెలిపారు. ఉత్తరకాశిలో క్లౌడ్ బరస్ట్ సంఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆందోళన వ్యక్తంచేశారు. "ఉత్తరకాశిలోని ధరాలిలో క్లౌడ్ బస్ట్ సంఘటన గురించి నాకు సమాచారం అందింది... మేము ప్రజలను రక్షించడానికి కృషి చేస్తున్నాము. జిల్లా యంత్రాంగం అధికారులతో మాట్లాడాను.'' అని పుష్కర్ సింగ్ ధామి అని పేర్కొన్నారు. ఏపీలోని తిరుపతిలో ఉన్న ఆయన ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నట్లు వెల్లడించారు.

## జూనియర్లకు మంత్రిపదవిచ్చారు

■ నాకివ్వలేదు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి

✍ **జయభేరి, నల్లగొండ:**



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసారు. నేను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదు. నాకు పదవులు కాదు, ప్రజలు ముఖ్యమని అన్నారు. ఎల్బీ నగర్ నుంచి పోటీచేస్తే మంత్రి పదవి వచ్చేది.. అయినా మునుగోడు ప్రజలే ముఖ్యమని ఇక్కడ పోటీచేశానని అన్నారు. వేల కోట్లు దోచుకునే వాడికి పదవులు కావాలి. అప్పుడు..మంత్రి పదవి ఇస్తా అంటేనే కాంగ్రెస్ లోకి బ్యాక్ అయ్యా. జూనియర్ లకు మంత్రి పదవి ఇచ్చి.. నన్ను దూరం పెట్టారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి అనేది వాళ్ళ విజ్ఞత. మునుగోడు అభివృద్ధి మాత్రం నా బాధ్యత. పదవుల కోసం దిగజారి కాళ్లు పట్టుకునే నైజం నాది కాదు. వేల కోట్లు దోచుకునే వాడికి పదవులు కావాలి, నాకెందుకు పదవులు. మంత్రి పదవి కావాలా..? మునుగోడు ప్రజలు కావాలా..? అంటే మునుగోడు ప్రజలే కావాలని చెబుతానని అన్నారు. ప్రజల కోసం మరోసారి పదవి త్యాగానికైనా రెడీ.. బీఆర్ఎస్ హయంలో రాజీనామా చేసి ప్రభుత్వాన్ని మునుగోడు ప్రజల కాళ్ళ దగ్గరికి తెచ్చా. ప్రజల కోసం మళ్ళీ రాజీనామాకైనా రెడీ అని అన్నారు.

# ట్రంప్ తెంపరితనం

ట్రంప్ నాలుక ఎప్పుడు మడతెట్టేస్తాడో ఎవరికీ తెలియదు.. ఏం మాట్లాడుతాడో అర్థం కాదు. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో అమెరికా తప్ప ఇతర ఏ దేశంపైన అయినా తన నోటిదూల వ్యక్తం చేస్తుంటాడు. తాజాగా భారత్ పైనే అదే అసహనాన్ని వెళ్లగక్కాడు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత ఆర్థిక వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీశాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా పేరుపొందిన భారతదేశాన్ని "డెడ్ ఎకానమీ" అని ఆయన వ్యాఖ్యానించడం చాలామందిని ఆశ్చర్యపరిచింది.



భారత ప్రధాని నరేంద్రమోదీ నాకు మంచి మిత్రుడు. భారత్ అమెరికాకు మంచి మిత్ర దేశం.. రెండు దేశాల మధ్య వాణిజ్యం, వ్యాపారంతోపాటు సైనిక సహకారం బాగుంది' ఇదీ మొన్నటి వరకు ట్రంప్ పలికిన చిలుక పలుకులు. కానీ, ఇప్పుడు భారత్ అన్నా.. మోదీ అన్నా ట్రంప్ నిప్పులు చెరుగుతున్నారు. ఉరిమి చూస్తున్నారు. భారత్‌తో దోస్తీ కటీఫ్ చేసి.. పాకిస్తాన్‌తో మిత్రుత్వం పెంచుకుంటున్నారు.

ఇక ప్రతీకార సుంకాలు భారీగా విధించారు. దీంతో భారత్, పాక్ సంబంధాలు దెబ్బతింటున్నాయి. ఈనేపథ్యంలో అసలు ట్రంప్‌కు కోపం ఎందుకు అన్న చర్చ జరుగుతోంది.ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతుండటం అమెరికాకు ఒక సవాలుగా మారింది. భారత్ వేగవంతమైన ఆర్థిక వృద్ధి, స్వతంత్ర విదేశాంగ విధానం, ఆంక్షలను ఎదుర్కొనే సామర్థ్యం ట్రంప్‌కు ఆందోళన కలిగిస్తోంది. గతంలో వాజ్‌పేయి ప్రభుత్వం పోఖ్రాన్ అణు పరీక్షల సమయంలో అమెరికా ఆంక్షలను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లే, ప్రస్తుతం కూడా భారత్ ఈ ఆంక్షలను బలంగా ఎదుర్కొంటోంది.భారత ప్రధాని నరేంద్రమోదీ నాకు మంచి మిత్రుడు. భారత్ అమెరికాకు మంచి మిత్ర దేశం.. రెండు దేశాల మధ్య వాణిజ్యం, వ్యాపారంతోపాటు సైనిక సహకారం బాగుంది' ఇదీ మొన్నటి వరకు ట్రంప్ పలికిన చిలుక పలుకులు. కానీ, ఇప్పుడు భారత్ అన్నా.. మోదీ అన్నా ట్రంప్ నిప్పులు చెరుగుతున్నారు. ఉరిమి చూస్తున్నారు.

భారత్‌తో దోస్తీ కటీఫ్ చేసి.. పాకిస్తాన్‌తో మిత్రుత్వం పెంచుకుంటున్నారు. ఇక ప్రతీకార సుంకాలు భారీగా విధించారు. దీంతో భారత్, పాక్ సంబంధాలు దెబ్బతింటున్నాయి. అసలు ట్రంప్‌కు కోపం ఎందుకు అన్న చర్చ జరుగుతోంది.భారత్, అమెరికా మధ్య సంబంధాలు చారిత్రకంగా సమతుల్యంగా సాగుతున్నప్పటికీ, ఇటీవలి కాలంలో డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో అమెరికా, భారత్‌పై కోపంతో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. భారత్ ఆర్థిక వృద్ధి, విదేశాంగ విధానం, వాణిజ్య ఒప్పందాలపై స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలు ఈ ఉద్రిక్తతకు కారణాలుగా కనిపిస్తున్నాయి.

అమెరికా డెయిరీ ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేయడానికి నిరాకరించడం ట్రంప్ కోపానికి ఒక ముఖ్య కారణం. చైనా అమెరికా డెయిరీ ఉత్పత్తులను కొనుగోలు చేయకపోవడంతో, భారత్‌ను కొత్త మార్కెట్‌గా చూసిన అమెరికా, ఈ విషయంలో నిరాశకు గురైంది. అమెరికాలో పశువులకు మాంసాహార ఆహారం ఇవ్వడం వల్ల ఉత్పత్తి అయ్యే పాల ఉత్పత్తులు భారత సాంస్కృతిక, ఆహార ఆచారాలకు అనుగుణంగా లేకపోవడంతో ప్రధాని మోదీ ఈ ఒప్పందాన్ని తిరస్కరించారు. ట్రంప్ దీనిని అమెరికా ఆర్థిక ప్రయోజనాలకు అడ్డంకిగా భావించారు.రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం అమెరికాకు మరో కీలక సమస్యగా మారింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు ఆర్థికంగా మద్దతు ఇస్తున్న దేశంగా భారత్‌ను అమెరికా దృష్టిలో ఉంచింది.

> **భారత్ ఈ ఆంక్షలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, పరస్పర ప్రయోజనాల ఆధారంగా మాత్రమే ఒప్పందాలకు సిద్ధమని స్పష్టం చేసింది. ఈ ధోరణి ట్రంప్‌కు మరింత కోపం తెప్పించింది.ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతుండటం అమెరికాకు ఒక సవాలుగా మారింది.**

ఈ యుద్ధం ఆగితే ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజాలను స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ ఆలోచనకు భారత్ అడ్డంకిగా కనిపిస్తోంది. భారత్ యొక్క ఈ విదేశాంగ విధానం, తన శక్తి అవసరాలను స్వతంత్రంగా నిర్వహించుకునే ప్రయత్నంగా ఉన్నప్పటికీ, అమెరికా దీనిని తమ భౌగోళిక రాజకీయ లక్ష్యాలకు వ్యతిరేకంగా భావిస్తోంది.పాకిస్తాన్‌లోని అణ్వాయుధాలపై అమెరికా పెట్టిన నియంత్రణ ఆపరేషన్ సిందూర్ ద్వారా బహిర్గతమవడం అమెరికాకు, ముఖ్యంగా ట్రంప్‌కు తీవ్ర ఆఘాతం కలిగించింది.

ఈ ఆపరేషన్ ద్వారా అమెరికా రహస్య ఎజెండా బయటపడడంతో, భారత్ దాని విదేశాంగ విధానంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఈ సంఘటన భారత్-పాకిస్తాన్ సంబంధాల్లో అమెరికా పాత్రను ప్రశ్నార్థకం చేసింది, ఫలితంగా ట్రంప్ భారత్‌పై కోపాన్ని మరింత పెంచింది.భారత్-పాకిస్తాన్ యుద్ధాన్ని ఆపివేయడంలో తామే కీలక పాత్ర పోషించామని ట్రంప్ పదే పదే చెప్పుకుంటున్నారు. భారత్ ప్రధాని మోదీ ఈ విషయంలో మూడో దేశం జోక్యం లేదని పార్లమెంటులో స్పష్టం చేశారు. ఈ ప్రకటన ట్రంప్ వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసింది. భారత్ ఈ స్వతంత్ర ధోరణి, అమెరికా ఆధిపత్య ఆలోచనలకు వ్యతిరేకంగా ఉండటం ట్రంప్ కోపానికి మరో కారణంగా మారింది. అమెరికా వాణిజ్య ఒప్పందాల్లో తన షరతులను రుద్దేందుకు ప్రయత్నించినప్పటికీ, భారత్ తన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడంలో దృఢంగా ఉంది. ఈ నేపథ్యంలో, ట్రంప్ భారత ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్ విధించారు.

అయితే, భారత్ ఈ ఆంక్షలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, పరస్పర ప్రయోజనాల ఆధారంగా మాత్రమే ఒప్పందాలకు సిద్ధమని స్పష్టం చేసింది. ఈ ధోరణి ట్రంప్‌కు మరింత కోపం తెప్పించింది.ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతుండటం అమెరికాకు ఒక సవాలుగా మారింది. భారత్ వేగవంతమైన ఆర్థిక వృద్ధి, స్వతంత్ర విదేశాంగ విధానం, ఆంక్షలను ఎదుర్కొనే సామర్థ్యం ట్రంప్‌కు ఆందోళన కలిగిస్తోంది. గతంలో వాజ్‌పేయి ప్రభుత్వం పోఖ్రాన్ అణు పరీక్షల సమయంలో అమెరికా ఆంక్షలను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లే, ప్రస్తుతం కూడా భారత్ ఈ ఆంక్షలను బలంగా ఎదుర్కొంటోంది.

## ఇందిరమ్మ ప్రభుత్వంలో విద్యా, వైద్యానికి పెద్దపీట

బాలికలక సైకిళ్లను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. "పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇప్పటికే 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సైకిళ్లు ఇచ్చామని, వచ్చే ఏడాది నుంచి జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా సైకిళ్లు అందజేయనున్నాం" అని హామీ ఇచ్చారు. గతంలో విద్యలో వెనుకబడిన ఈ ప్రాంతానికి ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లోనే రూ. 470 కోట్లను విద్యాభివృద్ధికి కేటాయించామని తెలిపారు. జేఎన్టీయూ ఏర్పాటు కోసం 208 కోట్లు కేటాయించి 110 కోట్లు మంజూరు చేశామని త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమౌతాయన్నారు. పాలేరు నియోజకవర్గంలో టెక్నికల్ విద్యను ప్రోత్సహించుట గాను తిరుమలయపాలెం మండలంలో రూ. 46 కోట్ల వ్యయంతో ఐటీఐ కాలేజీ నిర్మాణ చేయబోతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం నిర్మించిన రెసిడెన్షియల్ స్కూళ్లు కోళ్ల ఫారాలు, రైస్ మిల్లుల్లో మారిపోయాయని విమర్శించారు. కానీ ఇందిరమ్మ ప్రభుత్వంలో అందరూ ఒకే వేదికపై చదువుకునేలా యంగ్ ఇండియా స్కూళ్లు నిర్మిస్తున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ కూడా ప్రారంభించాం" అని పేర్కొన్నారు. "బీఆర్ ఎస్ నిర్వాకం వల్లే విద్యార్థులు ఈ దుస్థితికి చేరుకున్నారు. కాబట్టి ఈ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు మీకు లేదు" అంటూ గత ప్రభుత్వ పెద్దలపై విమర్శలు గుప్పించారు. "ఎన్ని ఇబ్బందులు వచ్చినా పిల్లలను మణిరత్నాలుగా తీర్చిదిద్దుతాం. తల్లిదండ్రులు కష్టపడి పాఠశాలకు పంపిస్తున్నారు. ఆ కోరిక నెరవేర్చే బాధ్యత మీది. విద్యార్థుల కోసం ఏదైనా కావాలన్నా నేను సాయం చేస్తా" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో నరసింహరావు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఎంఆర్వో పిల్లి రాంప్రసాద్, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్ఎం శివకుమారి, కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, ధరావత్ రామ్మూర్తి నాయక్, తమ్మినేని నవీన్, బండి జగదీష్, పంతుల్నాయక్, వెంపటి రవి, చారి, రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మౌలానా, రంగారవు, సీహెచ్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

**మంత్రి పొంగులేటి వల్ల నా కల నెరవేరింది : నర్రా. సంయుక్త, 8వ, తరగతి, మంగళగూడెం హైస్కూల్**

మాది డోర్నకల్ మండలం. వెన్నారం పంచాయతీ పరిధిలోని వెలిశాల గ్రామం. నేను 8వ తరగతి రూరల్ మండలం మంగళ గూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాను. గత నాలుగు సంవత్సరాల నుంచి మా గ్రామం వరకు మంగళగూడెం సుమారు 2 కిలోమీటర్లకు పైగా ఉన్న నడుచుకుంటూ వస్తూ విద్యనభ్యసిస్తున్నాను. మాది పేద కుటుంబం కావడంతో సైకిల్ కొనిచ్చే స్థోమత మా తల్లిదండ్రులకు లేదు. సైకిల్ మీద పాఠశాలకు రావాలనే కోరిక నాకు ఉండేది. అది ఈరోజు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో నెరవేరింది. ఆయనకు రుణపడి ఉంటాను. చాలా మంచి ప్రోగ్రామ్ చేస్తున్న సార్కు మా తరపున థ్యాంక్స్ అంటూ ఆనందం వ్యక్తం చేసింది.



## ఎవరికి ఓటు వేస్తావని అడగకుండానే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

■ మంత్రి పొంగులేటి

✍ **జయభేరి, తిరుమలాయపాలెం :**

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేదల సంక్షేమం పై ప్రభుత్వ వాగ్దానాలను పునరుద్ఘాటించారు. గ్రామంలోని రెండు చోట్ల రూ.3.30 కోట్ల విలువైన పీఆర్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అనంతరం రైతు వేదిక వద్ద నూతన రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాం. ఇంకా మూడు విడతల్లో మరిన్ని ఇళ్లు ఇవ్వబోతున్నాం. ఎవరి రాజకీయ అభిప్రాయం ఎలా ఉన్నా, ఎవరికి ఓటు వేస్తారో అడగకుండానే ఇళ్లు ఇస్తాం అని స్పష్టం చేశారు.


రాష్ట్రంలో 15 కొత్త ఐటీఐ కాలేజీలలో ఒకటి తిరుమలాయపాలెంకు కేటాయించామని, 30 పడకల ఆసుపత్రిని 26 కోట్ల రూపాయలతో 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. తిరుమలాయపాలెం మండల అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.77.50 కోట్లు కేటాయించినట్టు వెల్లడించారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ధరణి పేదలకు శాపంగా మారింది. దానిని బంగాళాఖాతంలో పడేసి, భూభారతి వ్యవస్థను తెచ్చాం. రెండు సార్లు మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌ను ప్రజలు మూడోసారి చెంపచెల్లుమనిపించారు అని మంత్రి విమర్శించారు.

ఎన్నికల ముందు కేసీఆర్ దోచుకున్నారని మేము చెప్పాం. 15 నెలల విచారణ తర్వాత జస్టిస్ పీసీ ఘోష్ 665 పేజీల తీర్పు ఇచ్చారు. కాళేశ్వరం అవకతవకలు అందులో రుజువయ్యాయి. అక్రమంగా దోచుకున్న డబ్బులు మళ్లీ ఖర్చు పెట్టడానికి మీ దగ్గరకు వస్తారు. ఆ డబ్బు తీసుకుని బీఆర్ఎస్‌కు రెండు చెంపలు చెళ్లుమనిపించాలి అని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరు అభద్రతకు గురికావద్దని భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల దీవెనలు ఇందిరమ్మ ప్రభుత్వానికి లభించాలని కోరుతూ తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్, ఆర్డీవో నరసింహా రావ్, పాలేరు స్పెషల్ ఆఫీసర్ రమేశ్, మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేశ్ రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు కొప్పుల అశోక్, బోడ మంగీలాల్, నాయకులు ఉన్నం రాజశేఖర్, తాటికొండ కిరణ్ కుమార్, అంబేద్కర్.మండల అధికారులు ఎంఆర్ఓ లూథర్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, ఏవో సీతారాం రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి PPT ప్రెజెంటేషన్

- సహచర ఎమ్మెల్యేల తో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- రేవంత్ పాలన గాలికొదిలేశారు..




**జయభేరి, హైదరాబాద్ :**

రేవంత్ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. వాస్తవాలు లేకుండా వండి వార్చిన రిపోర్ట్ బయటపెట్టారు. బిల్లు కావాలంటే 1012 శాతం కమీషన్లు కావాలి. బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. గోదావరి నదిపై పోలవరం ప్రాజెక్టు 3 సార్లు కుప్పకూలింది. పోలవరంపై NDSA ఎందుకు వెళ్లలేదు. మేడిగడ్డలో చిన్న ఘటన జరగగానే NDSA వచ్చింది. మాకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇస్తున్నారు. కుట్ర పూరితంగానే కమిషన్ విచారణ జరిగినట్లు కనిపిస్తోంది.

**వాస్తవాలను ప్రజల ముందుంచుతాం -హరీష్‌రావు**

665 పేజీల నివేదికలో నచ్చిన అంశాలపై బయటపెట్టారు. ఒక వైపే చూసి, విని, నిలబడి ఇచ్చిన రిపోర్ట్ ఇది. ఇది బేస్‌లెస్ రిపోర్ట్. దేశంలో ఎన్నో కమిషన్లు వేశారు..



న్యాయస్థానాల ముందు నిలబడవు. గతంలోనూ ఎంతో మంది రాజకీయ నేతలపై కమిషన్లు వేశారు. సీఎం రేవంత్ వరుస సీరియళ్లు నడుపుతున్నారు. కేసీఆర్‌ను హింసించాలన్నదే రేవంత్ ఉద్దేశం. కాంగ్రెస్ హయాంలో తమ్మిడిహట్టి దగ్గర దమ్మెడు మట్టి ఎందుకు వేయలేదు. తమ్మిడిహట్టి దగ్గర నీటి లభ్యత లేదు. జీవ సంపద ఉంది, మహారాష్ట్ర నుంచి అభ్యంతరాలు ఉన్నాయి. అందుకే అక్కడ ప్రాజెక్ట్ కట్టలేదు. కన్నేపల్లి దగ్గర మోటార్లు ఆన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు ధర్నా చేశారు. రెండేళ్ల నుంచి ఎందుకు తట్టెడు మట్టి ఎత్తలేదు. కేసీఆర్ మహారాష్ట్రలో చారిత్రాత్మక ఒప్పందం చేసుకున్నారు.

**కేసీఆర్ ఒకేసారి మూడు అగ్రిమెంట్లు చేశారు**

152 మీటర్లకు అగ్రిమెంట్ చేస్తే ఎలా తగ్గిస్తారని ఉత్తమ్ అన్నారు. ఇంకా గంట 40 నిమిషాలు బేగంపేట ఎయిర్‌పోర్టులో ఉంటా.. 152 మీటర్లకు ఒప్పుకున్నట్టు ఉత్తమ్ అగ్రిమెంట్ పత్రం తీసుకొస్తే.. ఇక్కడి నుంచి రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా చేస్తానని కేసీఆర్ సవాల్ విసిరారు. ఒక్క ఏడాదిలోనే 24 గంటల కరెంటు ఇచ్చారు. మిషన్ కాకతీయతో చెరువులను పునఃరుద్ధరించారు. పెండింగ్ ప్రాజెక్ట్‌లను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం. నువ్వు వచ్చినంక ఒక్క కాలువ తవ్విన, ఒక్క ఎకరానికి నీళ్లు ఇచ్చావా.. రెండేళ్లలో ఢిల్లీకి కమీషన్ల మూటలు తీసుకెళ్లావు. వచ్చే రెండేళ్లలో కూడా రేవంత్‌రెడ్డి చేసేదేమీలేదు. ఢిల్లీకి కమీషన్ల ముటాలు తీసుకెళ్లారు తప్ప చేసిందేమీ లేదు. కాటన్ బ్యారేజీ కట్టినా కమిషన్ వేసి వేధించారు. అయినా కాటన్ గోదావరి ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారు. కేసీఆర్‌కు కూడా తెలంగాణ ప్రజల గుండెల్లో దేవుడిలా నిలిచిపోతారు. కాళేశ్వరం ముమ్మాటికీ వర ప్రదాయినే, రేవంత్‌కు కూడా తెలుసు. కాళేశ్వరం కూలిందన్నోడు గంధమల్లకు కొబ్బరికాయ ఎట్ల కొడుతాడు. మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీళ్లు తీసుకొస్తానని చెబుతున్నాడు. కేసీఆర్ చేసింది వందేళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం నిర్మాణం. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సత్యహరిశ్చంద్రుడికి తమ్ముడి లెక్క మాట్లాడుతున్నారు. ప్రాణహితచేవెళ్లలో పెట్టిన ఖర్చు రూ. 3,700 కోట్లు మాత్రమే. రూ. 11 వేల కోట్లు ఖర్చు చేశామని ఉత్తమ్ చెబుతున్నాడు. మొబిలైజేషన్ అడ్వాన్లు పేరుమీద రూ. 2 వేల కోట్లు దొబ్బారు.

---



## పేద కుటుంబానికి 20వేల ఆర్థిక సహాయం

**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన బీసీ కాలనీవాసి కుంభం వెంకటేష్ కుటుంబానికి కేఎంపి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. వెంకటేష్ భార్య కుంభం సుగుణ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. పేద కుటుంబమైనా భార్యను బతికించుకోవాలనే తపనతో వైద్య ఖర్చులకు భారీగా ఖర్చు చేశారు. వీరికి ఐదు సంవత్సరాల పాప ఉంది. విషయం తెలుసుకున్న కేఎంపి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు వెంకటేష్ కుటుంబానికి 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. భవిష్యత్తులో కూడా మీ కుటుంబానికి సహకరిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, కూన భానుచందర్, విప్పలపల్లి జితేందర్ యాదవ్, దండు రవికుమార్, నాగార్జున రెడ్డి, భూతరాజు అంజన్ కుమార్, దోతి గణేష్, పిల్లి కృష్ణ, సైదులు, రమేష్, పరమేష్, లతీఫ్, శివ గౌడ్, కొండలు, ప్రవీణ్, మహేందర్, సందీప్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

---

## 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లిలో నమ్మదగిన సమాచారం తో మాల్ గ్రామము యాచారం మండలం కి చెందిన జర్పుల వెంకటేష్ అను అతను పెద్దవూర మండలానికి చెందిన గ్రామాలలో పిడిఎస్ బియ్యంని అక్రమంగా కలెక్ట్ చేసి తరలిస్తుండగా బండి నెంబర్ టిఎస్ 07HX 6953లో మల్లేపల్లి లో ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో సుమారు ఐదు క్వింటాలు బియ్యం పట్టుకోవడం జరిగింది అక్రమంగా బియ్యం తరలిస్తున్న వ్యక్తి పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనది.

---

# కాప్రా సర్కిల్ అభివృద్ధికి మరోసారి నిధుల ప్రవాహం..!

- రూ.5.55 కోట్ల నిధులను మంజూరు చేయించిన పరమేశ్వర్‌రెడ్డి
- కుషాయిగూడ మార్కెట్ అభివృద్ధికి రూ.55 లక్షల నిధులు
- శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు

**జయభేరి, కాప్రా :**



ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా సర్కిల్ అభివృద్ధికి మరోసారి భారీగా నిధులు మంజూరు అయ్యాయి. వివిధ రకాల అభివృద్ధి పనులకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి, చెర్లపల్లి, కాప్రా కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి రూ.5.55 కోట్ల నిధులను మంజూరు చేయించారు. సీఎం రేవంత్‌రెడ్డి గారి ఆదేశాలతో ఉప్పల్ నియోజకవర్గానికి పరమేశ్వర్‌రెడ్డి అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను రాబడుతున్నారు.

**కుషాయిగూడ మార్కెట్‌కు మంచి రోజులు..**

చర్లపల్లి డివిజన్‌లోని కుషాయిగూడ పాత కూరగాయల మార్కెట్‌కు మంచి రోజులు రానున్నాయి. శిథిలావస్థకు చేరిన మార్కెట్‌కు కొత్తరూపం ఇచ్చేందుకు రూ.55 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నారు.

శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు..

కాప్రా డివిజన్‌లోని సాయిబాబానగర్‌లోని హిందూ శ్మశాన వాటిక, ముస్లీం శ్మశానవాటిక, క్రిష్టియన్ శ్మశాన వాటిక, ఎల్లారెడ్డి గూడ, వంపుగూడలోని హిందూ శ్మశాన వాటిక, వంపుగూడ ముస్లీం శ్మశాన వాటిక, అమ్ముగూడ శ్మశాన వాటికలలో అభివృద్ధి పనులకు రూ.5 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో కనీస సౌకర్యాలు లేని మరుభూముల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సింగి రెడ్డి ధన్పాల్ రెడ్డి గారు, సీతారామం రెడ్డి గారు, అంజి రెడ్డి, రాజేందర్, డివిజన్ అధ్యక్షులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, కాశెట్టి ప్రసాద్, విఠల్ నాయక్, పెద్ది నాగరాజు, పెద్ది శ్రీనివాస్, పాకాల రాజు, నాగ శేషు, నాగరాజు, పూర్ణ యాదవ్, మల్ల రెడ్డి, పవన్, మార్కెట్ అధ్యక్షులు వాకిటి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్, ఎం రాజీ రెడ్డి, బి రవి నాయక్, బి రాములు నాయక్, పుట్ట రవీందర్, సూర్యకుమార్, ఏర్వ సుధాకర్, రఘు, బెల్లం కృష్ణ, డి మహేష్, పి నర్సింహ రెడ్డి, కట్ట శ్రీనివాస్, కమ్మల్లా యాదగిరి, కొడారి సందీప్, బండారి ఆంజనేయులు, ఎం కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

---

# ఒకేషనల్ గ్రూపులు అంటే ఎందుకంత చులకన

- జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ను తక్షణమే విధుల నుండి తొలగించాలి
- కొట్టె నవీన్, బిఎస్ఎఫ్ఐ మండల నాయకులు

**జయభేరి, చర్ల, ఆగస్టు 5 :**



ఒకేషనల్ విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కళాశాల ప్రిన్సిపాల్ ను తక్షణమే విధుల నుండి తొలగించాలని బిఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కొట్టె నవీన్ డిమాండ్ చేశారు. విద్యార్థులతో కలిసి కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ విద్యార్థి గ్రూప్ చేంజ్ అవుతానని చెప్పినందుకు ఆ విద్యార్థిని అవమానించే విధంగా ప్రిన్సిపాల్ మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు.. గతంలో సైతం ఒకేషనల్ గ్రూపుల పట్ల ప్రిన్సిపాల్ చిన్న చూపు చూస్తున్నారే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఒకేషనల్ గ్రూపులన్నీ పనికిమాలిన గ్రూపులని ఆ గ్రూపులో చదువుతున్న విద్యార్థులు మెరిట్ స్టూడెంట్స్ కాదని, చదువు రానివారు మాత్రమే ఆ గ్రూపులో చేరతారని బిలో యావరేజ్ స్టూడెంట్స్ మాత్రమే ఆ గ్రూపులో ఉంటారని ఆ గ్రూపుల వల్ల ఎటువంటి ఉపయోగం లేదని అనడం ఆశ్చర్యకరమని అన్నారు అవి చెత్త




గ్రూపులని కమిషనర్ కూడా మాతో అంటున్నాడని అన్నారు..బాధ్యత గల పోస్టులో ఉండి తన కాలేజీలో ఉన్నటువంటి ఒకేషనల్ కోర్సుని మంచి గ్రూపు కాదని చెప్పడం అత్యంత దుర్మార్గమని అన్నారు ఆయా గ్రూపుల్లో విద్యార్థులను అదేవిధంగా ఆ గ్రూపుకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులను కూడా ఘోరంగా అవమానించినట్లేనని మండిపడ్డారు తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించాలని సంబంధిత ప్రిన్సిపాల్ పై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థులను ఉపాధ్యాయులను అవమాన భారం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు లేనియెడల కచ్చితంగా ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా తీసుకుంటామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు ml నారాయణ , బి ఎస్ ఎఫ్ ఐ చర్ల మండలం నాయకులు సంతోష్ రాజేష్ , ప్రతాప్ రెడ్డి, బాలు, జగదీష్, సాయి, సుజిత్ , భగత్ సింగ్, ధనుష్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

---



## అందెల నివాసానికి హర్యానా మాజీ గవర్నర్ దత్తన్న

**జయభేరి, మహేశ్వరం :**

ఇటీవల హర్యానా గవర్నర్ గా పదవీ విరమణ పొందిన బండారు దత్తాత్రేయ రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు నివాసానికి విచ్చేసిన సందర్భంగా శ్రీరాములు ఘన స్వాగతం పలకడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్ రెడ్డి, కడారి జంగయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్పొరేషన్ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల అధ్యక్షులు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

## నాచారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్:**

భవాని నగర్ లో వీధి నెంబర్ 3, 4, 5 లలో 41 లక్షల రూపాయల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు. స్నేహపురి కాలనీ HDFC బ్యాంకు నుండి పార్కు వరకు ఐదు లక్షల రూపాయల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం. 4 లక్షల రూపాయల వ్యయంతో VST కాలనీలోని మేఫ్లవర్ అపార్ట్మెంట్ వద్ద భూగర్భ డ్రైనేజీ నిర్మాణం. నాచారం ఎర్రకుంట లోని హిందూ స్మశాన వాటికలో 30 లక్షల రూపాయల రూపాయల వ్యయంతో స్నానాల గదులు మరియు అదనపు బర్నింగ్ ప్లాట్ ఫామ్ నిర్మాణ పనులు. ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ లు కలిసి పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జలమండలి DGM సతీష్, AE వినీత్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

---

## షాద్ నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్





**జయభేరి, షాద్ నగర్ :**

షాద్ నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025 26 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిప్లమా ఇంజనీరింగ్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పరమేశ్వర్ తెలిపారు. కళాశాలలో ఉన్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ కోర్సులకు ఆగస్టు 5 నుండి 7 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు. పాలీసెట్ 2025లో ఉత్తీర్ణులైనవారితో పాటు అర్హత సాధించని అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని, అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, వాటి జిరాక్స్ కాపీలు, నిర్ధారిత ఫీజుతో ఆగస్టు 8న ఉదయం 9:30 గంటలకు వ్యక్తిగతంగా హాజరుకావాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆసక్తి ఉన్న కోర్సుల్లో చేరాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం కళాశాలను సంప్రదించాలని ఆయన సూచించారు.

---

## గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలి



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 05 :**

గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో గ్రామీణ వైద్యుల సమావేశాన్ని మండల అధ్యక్షుడు పెండెం రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో 24 గంటలు పేద ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. 60 సంవత్సరాలు నిండిన గ్రామీణ వైద్యులకు నెలకు పదివేల రూపాయల పెన్షన్ను అందజేయాలని కోరారు. గ్రామంలో అర్హులైన గ్రామీణ వైద్యులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిసికే నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కందిగట్ల లక్ష్మయ్య గౌడ్ ,జిల్లా ఈసీ మెంబర్ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు కసిర బోయిన బాలయ్య, చిలువేరు రవి, ఆకుల దేవయ్య, దుర్గయ్య, యూసుఫ్ , సత్యనారాయణ, ఎల్లేష్, సారిక, మహేష్, శేఖర్, శ్రీనివాస్, శివయ్య నాగేష్, షరీఫ్, కృష్ణ, లక్ష్మణ్, స్వామి, నరేష్, బాలచందర్, మండలంలోని వివిధ గ్రామాల గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.



## నీలి నాలిక వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 05 :**

నీలి నాలిక వ్యాధి నివారణ టీకాలను గొర్రెలు ,మేకల పెంపక దారులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో బ్లూ టంగ్ వ్యాధి నివారణ టీకాలను గొర్రెలు, మేకలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలలో వైరస్ వల్ల ప్రాబ్లం ఈ వ్యాధి చెందుతుందని, ఈ వ్యాధి సోకిన జంతువులకు నాలిక నీలం రంగులోకి మారుతుందని, నోటిలో పుండ్లు రావడం, జ్వరం లాలాజలం కారడం కాళ్లలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయని వ్యాధి రాకుండా వ్యాక్సిన్ ముందస్తుగా గొర్రెల ,మేకల కాపరదారులు వేసుకోవాలని అన్నారు. పశు వైద్యశాలలో వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రాఘవేందర్ రెడ్డి, సాహ్మద్దీన్ , వి ఏ ప్రవీణ్, గొర్రెల కాపలదారులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టకరం



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 05 :**

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టకరమని అంగన్వాడీ టీచర్ తునికి సులోచన అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యత మర్రిపాలు విశిష్టత గురించి ఆమె గర్భిణీలు ,బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా కోట మాధవి, తునికి భవిత, బి భాగ్యలక్ష్మి ,జి అనుష, ఎం భాగ్య, జీ మహేశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

## గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 05 :**

గ్రామీణ వికాసం బిజెపితోనే సాధ్యమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హర్ గర్ బిజెపి ప్రతి ఇంటికి బిజెపి వికసిత్ గ్రామ కార్యక్రమాన్ని తుర్కపల్లి మండల కేంద్రంలోని 66,67 బూతులలో ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాన్ని అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రెండు లక్షల 50వేల రూపాయలతోనే ఇందిరమ్మండ్ల నిర్మాణం చేస్తున్నారని, గ్రామాల్లో సిసి రోడ్లు, మోరీలు,, స్మశాన వాటికలు, లైట్లు ప్రతి అభివృద్ధి పథకాలు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని రైతులకు సంవత్సరానికి 6000 రూపాయల సీఎం కిసాన్ పథకం ద్వారా ఇస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీని ఆదరించి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ,మాజీ మండల అధ్యక్షుడు కొక్కొండ లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రమేష్, ఆకుల సైదులు, సీనియర్ నాయకుడు కందుకూరి చిన్న చలమయ్య, చాంద్ పాషా, శంకర్ నాయక్ ,మేకల పాండు, ఆకుల భాస్కర్ ,గుండబోయిన మల్లేష్, కందుకూరి వేణు ,ఎడపల్లి శేఖర్ పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కారం

- ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల



**జయభేరి, పరవాడ:**

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు దోహదపడతాయని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు అన్నారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ రమణి ఆధ్యక్షతన మంగళవారం పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిశువు పుట్టిన దగ్గర నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు బిడ్డ మానసిక, శారీరకంగా ఎదుగులకు ఉపయోగపడతాయన్నారు.రెండేళ్ల నుంచి బిడ్డకు అనుబంధ పోషకాహారాన్ని అందించాలని సుజాత ముత్యాలు పేర్కొన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రమణి మాట్లాడుతూ ప్రతి పల్లెలోనూ తల్లిపాల ప్రాముఖ్యతపై చర్చ జరగాలన్నారు. పిల్లల్లో వ్యాధినిరోధకశక్తి పెరగడానికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈనెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు మండల, గ్రామస్థాయిల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి, తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అంతకుముందు గర్భిణులకు సీమంతం నిర్వహించి చీరలు, పండ్లు, పసుపు కుంకుమ, బాలామృతం, టేక్ హోమ్ రేషన్‌ను సర్పంచ్‌తో పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ముత్యాలరాణి, రమాదేవి, మహేశ్వరి , ముత్యాలమ్మ, గౌతమి అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులను అందజేస్తాం

- రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు
- మేడ్చల్ పట్టణంలో లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ



**జయభేరి, మేడ్చల్ :**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలల శాఖ, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం మేడ్చల్ నియోజకవర్గం, మేడ్చల్ మండలంలోని అత్వెల్లిలో గల జివిఎన్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరిలతో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ చేయడం శుభ సూచకమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆహార భద్రత కార్డులు ఇస్తున్నామని అన్నారు. అలాగే రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరమని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రేషన్ కార్డులు పొందుతున్న లబ్ధిదారులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో గొప్ప వాళ్ళే సన్న బియ్యం తినేవారని, ప్రస్తుతం పేదలు కూడా సన్న బియ్యం తీనాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రేషన్ కార్డుల పై ఒక్కొక్కరికి సుమారు 6 కేజీల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. గత పాలకులు 10 సంవత్సరాలుగా అనేక మంది రేషన్ కార్డులకై ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని అర్హులైన ప్రతి ఒక్కరికి రాజకీయాల కతీతంగా రేషన్ కార్డులు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు రేషన్ కార్డులు రాని వారు నేరుగా మీ సేవా కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. రాలేదని నిరుత్సాహపడవద్దని, రేషన్ కార్డులు పంపిణీ రాష్ట్రంలో నిరంతర ప్రక్రియ అని ఆయన పేర్కొన్నరు. జిల్లాలో సుమారు 40,082 వేల కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తున్నామని, పాత రేషన్ కార్డులలో కొత్తగా సభ్యులను చేర్చడం, పేర్లు తొలగించడం వంటి మార్పులతో దాదాపు 82 వేల రేషన్ కార్డులను,మొత్తం 1 లక్ష 22 వేల కార్డులు పంపిణీ చేశారు.

అతి త్వరలో ఇంకో 60 రేషన్ కార్డులను సిద్ధం చేసి, పంపిణీ చేస్తామని మంత్రి పేర్కొన్నారు. సుమారు 2 లక్షల రేషన్ కార్డులను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలుపుతూ, రేషన్ కార్డు దారులు లబ్ధిపొందుతున్నట్లు తెలిపారు. పంపిణీ చేసిన రేషన్ కార్డుతో పాటు ఆరోగ్య శ్రీ కార్డు కూడా అమలు అవుతుందని తెలిపారు. రేషన్ డీలర్లు రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం ఇచ్చే సమయంలో ఎలాంటి పొరపాట్ల తావులేకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వము ఇచ్చిన 6 గ్యారెంటీలను తప్పక అమలు చేస్తామని, ఇందులో భాగంగా ఒక్కొక్కటిగా నిరంతరంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఇచ్చిన వాగ్దానంతో అర్హులైన అందరికీ పథకాలు అందిస్తూ ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ కార్యక్రమాలు చేస్తున్నామని, ఆర్థిక వ్యవస్థను మెరుపరుస్తూన్నామన్నారు.

అర్హులైన 3 లక్షల 75 వేల మంది లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఇందుకు గాను ఇప్పటి వరకు దాదాపుగా రూ.200 కోట్ల మేరకు ప్రభుత్వం ఖర్చు చేసిందని అన్నారు. అలాగే మహిళలకు ఆర్టీసి బస్సులో ఉచితంగా ప్రయాణం కల్పిస్తున్నామని, తద్వారా మహిళలు రాష్ట్రంలో ఎక్కడి కైన ఉచితంగా ప్రయాణం చేయవచ్చని అన్నారు. ఉచిత బస్సు వల్ల మహిళలకు డబ్బులు ఆదాఅవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో విద్యను బలోపేతం చేసి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలననే లక్ష్యంతో ప్రతి జిల్లాకు రూ. 200 కోట్లు ఖర్చుచేసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ హాస్టల్స్ ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్ మహానగరం అయినందున ఇతర రాష్ట్రాల నుండి అనేక ప్రజలు వచ్చి నివసిస్తున్నారని, అందరికి వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, జనాభాకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి జలాలను హైదరాబాద్ తరలించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి పక్కా ప్రణాళికతో ముందుకు పోతున్నామని తెలిపారు. అలాగే డ్రైనేజీ తో పాటు అన్ని మౌళిక వసతులు కల్పింపించుటకు కృషి చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి నీరుపేదకు ప్రతి నియోజకవర్గంలో పారదర్శకంగా 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

**మహిళల ఆర్థిక స్వాలంబనకు వడ్డీలేని రుణాలు -పట్నం మహేందర్ రెడ్డి**

అనంతరం శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం మహిళల ఆర్థిక స్వాలంబనకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నామని అన్నారు. రైతులకు రైతు భరోసా, రుణమాఫీ చేశామని తెలిపారు. గృహజ్యోతి పథకం, గ్యాస్ పథకం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఎక్కడ కూడా రాజీ పడకుండా అర్హులను గుర్తించి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. పేదలు సంతోషంగా ఉండాలనే రాష్ట్ర ప్రభుత్వము ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని, అర్హత కలిగిన ఎవరికైనా రేషన్ కార్డు రాకపోతే తిరిగి అప్లై చేసుకోవాలని చీఫ్ విప్ పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చేందాలని తెలిపారు.

**దశల వారీగా రేషన్ కార్డుల పంపిణీ: - జిల్లా కలెక్టర్ మను చౌదరి**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి మాట్లాడుతూ నూతన ఆహార భద్రతా కార్డులు కోసం జిల్లాలో అధిక మొత్తం దరఖాస్తులు వచ్చాయని, పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులను జారీ చేస్తున్నామని తెలిపారు. పాత రేషన్ కార్డుల్లో నూతనంగా లబ్దిదారులను చేర్చామని అన్నారు. రేషన్ కార్డులు కలిగిన ప్రతి ఒక్క లబ్దిదారునికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా సుమారు 618 రేషన్ షాపులు ద్వారా దాదాపు 15 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ప్రతి నెల అందిస్తున్నట్లు తెలిపారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తున్నారన్నారు. మన దగ్గర పండిచే బియ్యాన్ని విదేశాలకు సరఫరా చేయడం అభినందనియమని, దాన్యం కొనుగోలు కు ఐకెపి మహిళా సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి ఆర్థికంగా లబ్దిచేకూరుతుందని అన్నారు. ప్రభుత్వం మహిళ అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నందని, వాటిని ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా బలోపేటతం కావాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరి చేతుల మీదుగా లబ్దిదారులకు దాదాపు కోటి రూపాయల కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో గంథ్రాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింహులు యాదవ్, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్‌డిఓ ఉపేందర్ రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస రెడ్డి, శామీర్ పేట్ తహాశీల్దార్ యాదగిరి రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రేషన్ కార్డుల లబ్దిదారులు, తదితరలు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఈటెల రాజేందర్ ని కలిసిన గిరిజన సంఘాల నాయకులు

- పార్లమెంట్లో బంజారా భాష గుర్తింపుకై గలమెత్తుతాననీ
- అలాగే ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇవ్వడం జరిగింది
- బంజారా భాష అంతరించిపోకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిది



**జయభేరి, కొండమల్లేపల్లి :**

గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఢిల్లీలో వివిధ పార్టీ నాయకులను కలిసి బంజారా భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చే విధంగా కృషి చేయాలని పార్లమెంటులో మాట్లాడాలని వివిధ నాయకులను కోరడం జరిగింది. అందులో భాగంగా మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ , బంజారా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్పతి నాయక్, బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివా నాయక్ ,గిరిజన సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ పవర్, బిజీయా బిజీబిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్ నాయక్ కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కచ్చితంగా బంజారా భాషను గుర్తించి గుర్తించాల్సిందేనని సుమారు 17 రాష్ట్రాల్లో మాట్లాడే ఏకైక భాష బంజారా భాషా అని అటువంటి భాషను గుర్తించకపోవడం చాలా బాధాకరమని కచ్చితంగా పార్లమెంట్ సాక్షిగా బంజారా సమాజం యొక్క భాషా అంతరించిపోకుండా గలమెత్తి గుర్తింపు వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అందుకుగాను గిరిజన సంఘాల నాయకులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది రాబోయే కాలంలో కేంద్ర మంత్రులను అలాగే ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్లాలని కోరడం జరిగింది. ఇంకా ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాణిక్యం ఠాకూర్ ని అలాగే అనేకమంది నాయకులను కలిసి గిరిజన సంఘాలు వారి యొక్క వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగినది అని మోహన్ పవర్ తెలియజేసినారు.

# బైకులను చోరీ చేసిన దొంగను అరెస్టు చేసిన పోలీసులు

- మీడియాకు వివరాలు వెల్లడించిన ఏసిపి లక్ష్మీనారాయణ



**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 05 :**

షాద్ నగర్ నియోజక వర్గంలో పలుచోట్ల బైకులను చోరీ చేసిన దొంగను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మీడియాకు వివరాలు వెల్లడించిన ఏసీపీ లక్ష్మీనారాయణ. బైక్ పిర్యాదు దారుడు కొందుర్గు మండలము, చేర్కుపల్లి గ్రామ నివాసి నర్సిములు తేదీ :19 జూన్ 2025 నాడు సమయం ఉదయము 10 గంటలకు తన యొక్క స్ప్లె ఢర్ ప్లస్ బైక్ TS07FJ2739 నంబర్ గల దానిని ఆర్‌టిసి బస్ స్టాండ్ కొరియర్ ఆఫీసు షాద్ నగర్ పక్కన పార్క్ చేసి మళ్ళీ తిరిగి తేదీ 21 జూన్ 2025 నాడు సాయంత్రము 5 గంటలకు వచ్చి చూసుకోగా అతని యొక్క బైక్ కనపడలేదు అని ఫిర్యాదారుడు షాద్ నగర్ పోలీసు స్టేషన్ కి వచ్చి అదే రోజు పిర్యాదు చేశాడు.

ఈ కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు లో బాగంగా తేదీ 04 ఆగస్టు 2025 నాడు ఇట్టి కేసును షాద్ నగర్ పోలీసు వారు టెక్నికల్ ఎవిడెన్స్ ఆదారంగా కేసును ఛేదించి నిందితుడు అయిన కొర్రా వినోద్ ను ఇన్ముల్ నర్వ గ్రామస్తున్నీ అరెస్టు చేసి విచారించగా నిందితుడు షాద్ నగర్ పోలీసు స్టేషన్ పరిదిలో ఇండ్ల ముందు కానీ, షాప్ ల ముందు కానీ తాళాలు వేసిన బైక్ లను గమనించి చుట్టుపక్కల ఎవరు లేనిది చూసి బైక్ ల యొక్క హ్యాండిల్ విరగ్గొట్టి అక్కడి నుండి తీసుకొని పారిపోతాను అని ఒప్పుకున్నాడు. నిందితుని వద్ద నుండి షాద్ నగర్ పోలీసు స్టేషన్ కు సబందించిన 4 బైక్ లు నిందితుని వద్ద నుండి స్వాదీనపర్చుకొని నిందితుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

**నిందితుపై గతములులోనే పలు కేసులు నమోదు..**

షాద్ నగర్ పోలీసు స్టేషన్ పరిదిలో నాలుగు, శంషాబాద్ పరిదిలో ఒకటి, కొత్తూర్ పరిదిలో నాలుగు, అఫ్జల్గంజ్ పరిదిలో రెండు మొత్తం 11 బైక్ ల కేసులలో దొంగతనము చేసి జైల్ కి వెళ్ళి వచ్చాడు. నిందితుడి వద్ద నుండి స్వాదీనపర్చుకున్నవి; హోండాషైన్, యునికార్న్, గ్లామర్, స్ప్లె ఢర్ ప్లస్, TS07EM1079 , TS11EM0679, TS06EU3376, TS 07FJ2739, మొత్తం రికవరీ రెండు లక్షలు రూపాయలు అని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసు శంషాబాద్ డీసీపీ రాజేశ్ అడిషనల్ డీసీపీ కె.పూర్ణచందర్ , షాద్ నగర్ ఏసీపీ.ఎస్. లక్ష్మీనారాయణ ,పర్యవేక్షణలో, సిఐ పి. విజయ్ కుమార్, ఎస్ వెంకటేశ్వర్లు డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ , విచారణాదికారి, క్రైమ్ డిటెక్టివ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి శివ రెడ్డి, క్రైమ్ టీం; రవీందర్, సంతోష్ ,కర్ణాకర్, జాకీర్, రాజు కేసును ఛేదించడంలో కీలక పోషించారు. వారికి తగిన రివార్డ్ లను పై అదికారుల ద్వారా ఇప్పించడం జరుగుతుంది తెలిపారు.

## తుళ్లూరులో మంత్రి నారాయణ పర్యటన

**జయభేరి, అమరావతి:**

రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలంలోని వివిధ గ్రామాలలో మంత్రి నారాయణ విస్తృతంగా పర్యటించారు. ఈ క్రమంలో అనంతరం దగ్గరలో గ్రావిటీ కెనాల్ పనులను మరియు అనంతరం గ్రామంలో ఉన్న పార్కును మంత్రి నారాయణ పరిశీలించారు ఈ నేపథ్యంలో అధికారులకు మంత్రి పలు సూచనలు సైతం చేశారు. గ్రావిటీ కెనాల్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మరోసారి వచ్చే సమయానికి పనులలో పురోగతి ఉండాలి అన్నారు. రాజధాని లో సుమారు 25 వేల మందికి సంవత్సరం కౌలు నిధుల జమ చేయాల్సి ఉండగా. నిన్నటి వరకు వివిధ కారణాలతో 7000 మందికి జమ కాలేదని మంత్రి నారాయణ తుళ్లూరు మండలం శాఖమూరు లో మంగళవారంనాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అన్నారు. తాజాగా పెండింగ్లో ఉన్న నిధులు కూడా అకౌంట్లో జమయ్యాయి అని అయితే 900 మందికి వివిధ కారణాలతో ఇంకా నిధులు జమ కాలేదని తెలిపారు. వారి అకౌంట్లోను మరోసారి పరిశీలించినట్లు నారాయణ స్పష్టం చేశారు.

## ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచార యత్నం

**జయభేరి, వికారాబాద్:**

వికారాబాద్ జిల్లా చన్గోముల్ పోలీసు స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. 8 ఏళ్ల బాలికపై ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. కొన్ని కుటుంబాలు ఒరిస్సా నుంచి వచ్చి నేవీ రాడార్ స్థలంలో పనులు చేస్తున్నారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కృష్ణ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన 8 ఏళ్ల బాలిక నోట్లో గుడ్డ కుక్కి అత్యాచారం చేసేందుకు యత్నించాడు. బాలిక అరుపులతో స్థానికులు గమనించి అతడిని పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

## ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు

**జయభేరి, విశాఖపట్నం:**

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన విశాఖపట్నం కలెక్టరేట్ లో ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులతో కూడిన ప్రాంతీయ సదస్సు జరిగింది.రాష్ట్ర సివిల్ సప్లైస్ కమిషనర్ సౌరభ్ గౌర్ తో కలిసి వివిధ అంశాలపై సమీక్షించారు మంత్రి. ఉత్తరాంధ్ర జిల్లాల పౌర సరఫరాల అధికారులు, సివిల్ సప్లైస్ డి.ఎం.లు, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు, బిపిసిఎల్, ఐఓసీఎల్, హెచ్పీసిఎల్, ఇతర అధికారులు పాల్గోన్నారు.

## స్మార్ట్ మీటర్ల పై వామపక్షాల నిరసన

**జయభేరి, విశాఖపట్నం:**

విశాఖలో విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీలు,పౌరసంఘాలు నిరసనకు దిగాయి.స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ర్యాలీ కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు భారం కలుగుతూనే తప్ప ఉపయోగం లేదని అన్నారు. కేవలం అదాని కీ లాభం చేకూర్చేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ స్మార్ట్ మీటర్లను తీసుకువచ్చిందని వారు విమర్శించారు. తక్షణమే ప్రభుత్వాలు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆధునీకరించిన పరవాడ బీసీ ప్రభుత్వ బాలుర వసతి గృహంను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**జయభేరి, పరవాడ:**

హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ తమ సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పరవాడలో దెబ్బ తిన్న బాలుర వసతి గృహన్ని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి మంగళవారం బిసి ప్రభుత్వ బాలుర వసతి గృహం ను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతులు మీదగా ప్రారంభించింది. ఈ సందర్బంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లల విద్యా వసతులను మెరుగుపరచడం పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.



ఈ వసతి గృహంలో అనకాపల్లి మరియు విశాఖపట్నం జిల్లాలకు చెందిన పలు గ్రామాలలోని పేద కుటుంబాలకు చెందిన 100 మందికి పైగా విద్యార్థులకు ఈ కార్యక్రమం ప్రయోజనం చేకూరుస్తుంది విద్యార్థులు తమ విద్యను కొనసాగించడానికి వారికి అనుకూలమైన వాతావరణాన్ని అందిస్తుందని తెలిపారు.




ఈ ప్రాజెక్టులో భాగంగా, లక్ష్య కేంద్రీకృత విద్యా అనుభవాన్ని పెంపొందించటానికి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలతో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు.ప్రతి చిన్నారి, వారు ఎక్కడి నుండి వచ్చినప్పటికీ నేర్చుకోవడానికి, ఎదగడానికి, తమ కలలు సాకారం చేసుకోవటానికి ఇవి దొహదా పడతాయి అని అలాగే ఈ కార్యక్రమం చిన్నదే అయినప్పటికీ అర్థవంతమైన ముందడుగు అని గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,కంపెనీ ప్రతినిధులు,స్థానిక నాయుకులు పాల్గొన్నారు.



## ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

- గోండ్వాన్ సంక్షేమ పరిషత్ నాయకులు టింగా బుచ్చయ్య

**జయభేరి, వాజేడు, ఆగస్టు 05 :**

ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఆగస్టు 9న మండల ప్రజలంతా ఘనంగా జరుపుకోవాలని ఆదివాసి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.మండల కేంద్రం చెరుకూరు గ్రామంలో పోచమ్మతల్లీ గుడి ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఆగస్టు 9న గుర్తించినందున మండల ప్రజలంతా గ్రామ గ్రామాన పండగ వాతావరణంతో జండా ఎగరవేసి ఉత్సాహంగా జరుపుకోవాలని అన్నారు.అలాగే మండల కేంద్రంలో కొమరం భీం విగ్రహం దగ్గర జరిగే కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోండ్వాన్ సంక్షేమ పరిషత్ నాయకులు చింత మోహన్. గొంది మల్లికార్జున్,సంక్షేమ పరిషత్ నాయకుడు టింగ.బుచ్చయ్య, తొర్రం .మనోజ్. లోడిగా నరసింహారావు. కుర్సం .లక్ష్మణ్, ఆది నారాయణ, సాంబశివరావు, గ్రామ పెద్ద ఇరుప.సత్యనారాయణ, మనప భద్రం, పూణెం శ్రీను, పెద్ది తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్కు జ్యోతిరావు పూలే చిత్రపటాన్ని అందజేసిన రియా ఫౌండేషన్ ప్రతినిధులు



**జయభేరి, పరవాడ:**

ఆధునీకరించిన స్థానిక బాలుర ప్రభుత్వ వసతగృహాన్ని ప్రారంభించడానికి మంగళవారం ముఖ్యఅతిథిగా విచ్చేసిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ కు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే చిత్రపటాన్ని రియా ఫౌండేషన్ చైర్మన్ ఎండి రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరవాడ మండలం ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ నార పిన్ని గణేష్, ఎస్.జి. టాక్స్ తెలుగు యూట్యూబ్ ఛానల్ చైర్మన్ పైలా శ్రీను, స్థానిక పత్రిక విలేకరులు సురేష్ కుమార్, రాధాకృష్ణ, నందవరపు రాము, జె. ప్రేమ్ కుమార్,రియా ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ బీ నగర్ దగ్గర డబుల్ డెక్కర్ రోడ్డు



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 5:**

హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్‌ను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోంది. ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకూ 5.5 కిలోమీటర్ల మేర 8వరుసలతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు రూ.650 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా...! ఈ రోడ్డు నిర్మాణం చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నాగ్‌పూర్‌లో నిర్మించిన డబుల్ డెక్కర్ కారిడార్ నమూనాలోనే ఇక్కడ కూడా నిర్మించాలని భావిస్తున్నారు. ఎల్‌బీనగర్ వద్ద ట్రాఫిక్ పరిస్థితిని ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో సమీక్షించారు. విజయవాడ హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఏ స్థాయిలో రద్దీ ఉంటుందో అందరికీ అనుభవమే. ఎల్బీనగర్ దగ్గర అవుటర్ వరకూ రోడ్డు విపరీతంగా రద్దీ ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఆ రోడ్లను వెడల్పు చేసినప్పటికీ రద్దీ ఏమాత్రం తగ్గడం లేదు. జాతీయ రహదారిపై నుంచి వచ్చే వాహనాలకు లోకల్ ట్రాఫిక్ కలవడంతో చాలా ఎక్కువ రద్దీగా ఉంటోంది. అందుకే వాహనాలు నేరుగా ఎల్బీనగర్‌కు చేరుకునేలా..ఇటు నుంచి కకూడ అంతరాయం లేకుండా వెళ్లేలా పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని అనుకుంటున్నారు విస్తరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న మెట్రో లైన్‌ను హయత్‌నగర్ వరకూ విస్తరించాలని ఇంతకు ముందే నిర్ణయించారు. ఇప్పుడు చేపట్టబోయే నిర్మాణం దానిని కూడా దృష్టిలో ఉంచుకుని చేయనున్నారు. ఇందులో కింద సర్వీసు రోడ్డు ఉంటుంది. మధ్యలో 8వరుసల ఫ్లైఓవర్.. దానిపైన మెట్రో మార్గం ఉంటుంది. ఇలా డబల్ డెక్కర్ రోడ్డును 5.5 కిలోమీటర్ల వరకూ నిర్మిస్తారు. ప్రస్తుతం విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారి విస్తరణ జరుగుతోంది. నగరానికి వెలుపల కొన్ని చోట్ల రోడ్ల విస్తరణ చేపట్టారు. చౌటప్పల్ దగ్గర ఉన్న మల్కాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకూ ఉన్న రోడ్డు ఇరుకుగా ఉండటంతో దానిని విస్తరించడానికి 541కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ORR లోపల పెద్ద అంబర్‌పేట్ వరకూ రోడ్డు విస్తరణ పూర్తైంది. ఆ తర్వాత కూడా రోడ్డు వెడల్పు బాగానే ఉన్నప్పటికీ నగరంలోని ట్రాఫిక్ హైవేపైకి వచ్చి ఇబ్బంది అవుతోంది. సిటీ మధ్యలో ఉండటంతో రోడ్డును డివైడర్‌తో క్లోజ్ చేయడం ఇబ్బంది అవుతోంది. చాలా చోట్ల పాసింగ్ కోసం రోడ్డును ఓపెన్ చేయాల్సి వస్తోంది. అందుకే పెద్ద అంబర్‌పేట్ నుంచి ఎల్బీనగర్ వరకూ ఎలాంటి అంతరాయం లేకుండా ఎలివేటెడ్ మార్గం వేయాలని అనుకుంటున్నారు. మెట్రో కోసం ఎలాగూ ఎలివేటెడ్ మార్గాన్ని వేయాలి కాబట్టి రెండింటికీ కలిసొచ్చేలా దీనిని ప్రతిపాదించారు. ఈ మార్గాన్ని ఏడాది లోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. దీనిపై 6వతేదీన కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలుస్తున్నామని చెప్పారు.విజయవాడ హైదరాబాద్ మధ్య పెరుగుతున్న రద్దీ దృష్ట్యా మరో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు కేంద్రం ఓకే చెప్పింది. ఏపీ కొత్తరాజధాని అమరావతి నుంచి.. ఫ్యూచర్ సిటీ దగ్గర ORRకు కలిసేలా దీనిని తెలంగాణ ప్రభుత్వం అడుగుతోంది. ఏపీ సీఎం చంద్రబాబు కూడా హైదరాబాద్ విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే కావాలని రెండు రోజుల కిందట విజయవాడ వచ్చిన గడ్కరీని కోరారు. ఆయన వెంటనే ఆమోదం తెలిపారు. యాక్సెస్ కంట్రోల్డ్.. గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రెండు గంటల్లోనే హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లిపోవచ్చని కోమటిరెడ్డి అంటున్నారు.



## 17 వేల కోట్ల భారం వేసారు

- జగన్ కు వారసుడు చంద్రబాబు
- వైఎస్ షర్మిలా రెడ్డి

**జయభేరి, విజయవాడ:**

విద్యుత్ సర్దుబాటు పేరుతో ప్రజల మీద కూటమి ప్రభుత్వం విధిస్తున్నది సర్దుపోటు. పెంచేది లేదంటూనే జనాలకు బాబు గారు పెడుతున్నవి షాకుల మీద షాకులని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి మండిపడ్డారు. అవి ట్రూ అప్ ఛార్జీలు కాదు..సామాన్యుడిని నడ్డి విరిచే ఛార్జీలు. రాష్ట్ర ప్రజానీకాన్ని పీల్చి పిప్పి చేసే ఛార్జీలు. జనం నెత్తిన మీరు పెడుతున్నది గుదిబండ. ఇప్పటికే రూ.17 వేల కోట్ల భారాన్ని మోపారు. ఇది చాలదన్నట్లు మరో రూ.12 వేల కోట్ల మేర అధిక భారాన్ని మోపాలని చూడటం దుర్మార్గమన్నారు. ట్రూ అప్ చార్జీల వసూళ్లపై విద్యుత్ నియంత్రణ మండలి ప్రజా అభిప్రాయం సేకరిస్తుంటే.. కూటమి ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటు. కరెంటు ఛార్జీల వీర బాదుడులో జగన్ కి చంద్రబాబు వారసుడు. కూటమిని గెలిపిస్తే ఒక్క రూపాయి పెంపు ఉండదన్నారు. అవసరమైతే ఛార్జీల్లో 30 శాతం తగ్గిస్తామని గొప్పలు చెప్పారు. తీరా పవర్ దక్కాక 14 నెలల్లోనే రూ.30 వేల కోట్ల సర్దుబాటు భారాన్ని జనం నెత్తిన పెడుతున్నారు. హామీలను మరిచి ఓటేసిన పాపానికి పేదోడి ఇళ్లను గుళ్ళ చేస్తున్నారు. ట్రూ అప్ తప్పు మీది కాదు సరే.. అలాగని గత వైకాపా తప్పిదాలను ప్రజల నెత్తిన రుద్దుతారా ? వైకాపా పెట్టిన భారాన్ని జనాల దగ్గర ముక్కు పిండి వసూలు చేస్తారా ? గత పాలకుల తప్పులను సరిదిద్దడం అంటే జనాలను బాదడమా ? ఏనాడో వాడిన కరెంటుకు ఇప్పుడు అదనపు ఛార్జీలు వేయడం ఏంటి ? ట్రూ అప్ పేరుతో ఎన్నాళ్లు ఈ దోపిడని ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీల విషయంలో ప్రజలకు చంద్రబాబు చేసింది నమ్మక ద్రోహం. కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. రూ.12 వేల కోట్ల సర్దుబాటు భారాన్ని ప్రజలపై పడకుండా చూడండని అన్నారు. ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. వెంటనే చంద్రబాబు ఏపీ ఈఆర్సీకి లేఖ రాయాలి. గతంలో విధించిన రూ.17 వేల కోట్ల భారాన్ని సైతం వెనక్కి తీసుకోవాలి. గత ప్రభుత్వం తప్పు చేసినా.. ప్రజా కోర్టులో పడే శిక్ష మీకే అన్న సంగతి చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలని అన్నారు.

## చిన్న ఆసరా.. పెద్ద అండ

- ఆగస్టు 19 నుంచి పీ4 అమలు

**జయభేరి, అమరావతి, ఆగస్టు 05 :**

పేదరిక నిర్మూలనకు చేపడుతున్న జీరో పావర్టీపీ4 లక్ష్యం 2029 నాటికి సాకారం అవుతుందని.. ఇదే మొదటి అడుగు అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ లో చేపట్టిన పీ4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. మంగళవారం సచివాలయంలో పీ4పై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 19వ తేదీ నుంచి పీ4 అమలు చేయాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. సచివాలయంలో నిర్వహించిన ఈ సమీక్షకు సీఎస్ విజయానంద్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పీ4 ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కుటుంబరావు, ఆర్థిక, ప్రణాళిక శాఖ అధికారులు హాజరయ్యారు. సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పేదరిక నిర్మూలనలో భాగంగానే పీ4 కార్యక్రమాన్ని చేపట్టాం. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యం. సమాజానికి తిరిగి ఇవ్వాలన్నదే ప్రధాన ఉద్దేశం. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుంది. ఆ స్ఫూర్తితోనే అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు పల్లెకుంట హేమలత మార్గదర్శిగా మారి ఓ వృద్ధురాలిని ఆదుకుంటున్నారు. స్పందించే మనస్సు ఉంటే... పేదల్ని ఆదుకునేందుకు మానవత్వం చూపుతూ ముందుకు వస్తారు. డబ్బుతో పాటు.. సాయం చేసే వారు కూడా మార్గదర్శులే. బంగారు కుటంబాలకు కావాల్సింది ఎమోషనల్ బాండింగ్, చేయూత మాత్రమే. సీఎస్సార్ నిధులతో బిల్ గేట్స్, వేదాంత లాంటి సంస్థలు పనిచేస్తున్నాయి.

## పారదర్శకంగా.. నిష్పక్షపాతంగా రీ సర్వే నిర్వహించాలి

- రైతులు సహకరించాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 5 :**

రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న భూ పునఃసర్వే (రీసర్వే) కార్యక్రమాన్ని ములుగు జిల్లాలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు. రైతులంతా పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. మంగళవారం వెంకటాపురం మండలంలోని నూగురు(జి) గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద కొనసాగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భూ సరిహద్దుల గుర్తింపు, సర్వే ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజ నరసయ్య, సర్వేయర్ వీరస్వామి కలెక్టర్‌కు వివరాలు అందించారు. సర్వే ఏజెన్సీ ఆధ్వర్యంలో పహానీ వివరాలు, పట్టాదారుల సమాచారం, ఎంజాయ్‌మెంట్ డేటా ఆధారంగా ఫీల్డ్ రిజిస్టర్ తయారీ, భూ నక్షా రూపకల్పన పనులు జరుగుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ "సర్వే ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా, ఖచ్చితమైన డేటా నమోదు కావాలన్నారు. భవిష్యత్ లో భూ వివాదాలను నివారించాలంటే ఈ రీసర్వే కీలకమని, అందుకే ప్రతి ఒక్కరూ సహకరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్ వేణుగోపాల్, సర్వే ఏజెన్సీప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## అదానీ స్మార్ట్‌మీటర్లు సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చెయ్యాలి

- స్మార్ట్ మీటర్లను బిగించవద్దు సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్

**జయభేరి, పరవాడ:**

స్మార్టు మీటర్లు బిగించవద్దని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం పరవాడ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శు జి కోటేశ్వరరావు మాట్లాడుతూ అదానీ విద్యుత్ స్మార్ట్‌మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారని, ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పి అధికారంలోకివచ్చి అదే స్మార్ట్ మీటర్లు బిగింపు చర్యలు తీసుకోవడం దుర్మార్గం అన్నారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లకు ఒప్పందాలు చేసుకుని, అదాని సంస్థకు టెండర్లను కట్టబెట్టి, భారీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించిన కూటమి ప్రభుత్వం పదివేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతుందన్నారు.అందుకే గత ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదానీ స్మార్ట్‌మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. స్మార్ట్‌మీటర్ బిగించడాన్ని వ్యతిరేకస్తు పాత మీటర్లనే కొనసాగిస్తూ, పాత రీడిరగ్ పద్ధతినే అమలు చేయాలని, గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, షాపులు, సంస్థలకు పెట్టిన మీటర్లు తొలగించాలని, సర్దుబాటు ఛార్జీలు పూర్తిగా రద్దు చేసి బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వివి రమణ, పి మాణిక్యం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా నాయకులు ఎం బంగారమ్మ, టి అన్నపూర్ణ, డి సీతమ్మ, కే సాయి వేణి, డి నాగదేవి, ఎస్కే బేగం, గౌరీ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## ఉచిత మంచినీటి పథకాన్ని ముట్టుకుంటే ముఖ్యమంత్రి మసే..!.

- రైతులకు సాగుని ఇవ్వలేని ఈ దద్దమ్మ సర్కారు
- ఇది ముఖ్యమంత్రి మూర్ఖత్వానికి పరాకాష్ట
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

**జయభేరి, హైదరాబాద్ ఆగష్టు 5:**

హైదరాబాద్ వాసులకు కేసీఆర్ అందించిన ఉచిత మంచినీటి పథకాన్ని ముట్టుకుంటే ముఖ్యమంత్రి మసే..!. నని రైతులకు సాగునీ ఇవ్వలేని ఈ దద్దమ్మ సర్కారు.. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉచిత తాగునీటి పథకానికి కూడా పాతరేయాలని చూడటం ముఖ్యమంత్రి మూర్ఖత్వానికి పరాకాష్ట అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మహానగరంలోని కోటి 20 లక్షల మంది ప్రజలు చరిత్రలో కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను క్షమించరన్నారు. ఇప్పటికే హైడ్రా వంటి దిక్కుమాలిన నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.‘ 20 నెలలు కావస్తున్నా.. ఇచ్చిన 420 హామీలు అమలు చేయలేక ఇప్పటికే చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి మహాపాపాన్ని మూటగట్టుకున్నారు. బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలకు కూడా ఉరివేస్తే.. మహానగరంలోని కోటి 20 లక్షల మంది ప్రజలు చరిత్రలో కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను క్షమించరు. రైతులకు సాగునీరు ఇవ్వలేని ఈ దద్దమ్మ సర్కారు, ఇప్పుడు హైదరాబాద్ లో ఉచిత తాగునీటి పథకానికి కూడా పాతరేయాలని చూడటం ముఖ్యమంత్రి మూర్ఖత్వానికి పరాకాష్ట.ఇప్పటికే హైడ్రా వంటి దిక్కుమాలిన నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసి తీరని నష్టాన్ని కలిగించారు. బీఆర్ఎస్ ప్రగతి ప్రస్థానంలో రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేని రాజధాని వాసులకు మళ్లీ కరెంట్ కష్టాలను పరిచయం చేసిన పాపం రేవంత్‌దే. ఓవైపు అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ, ఇంకోవైపు వర్షాలకు దెబ్బతిన్న రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతుంటే..ఫ్రీ వాటర్ స్కీమ్‌ను కూడా గండికొట్టాలని చూస్తున్న రేవంత్‌కు కర్రు గాల్చి పెట్టేందుకు హైదరాబాద్ ప్రజలు సిద్ధంగా ఉన్నారు’ అని కేటీఆర్ ట్వీట్ చేశారు.



# ఈ వయస్సులోను ఇంత ఫిట్‌గా..

టాలీవుడ్‌లో వయసుతో పని లేకుండా స్టైల్, హ్యాండ్సమ్‌తో మెరిసే హీరో ఎవరు అంటే, ఠక్కున గుర్తుకు వచ్చే పేరు కింగ్ నాగార్జున. ఆరుపదుల వయస్సు దాటిన కూడా ఇంకా యంగ్ హీరోల మాదిరిగా కనిపిస్తున్నాడు. నాగ చైతన్య, అఖిల్‌లకి నాగార్జున అన్నయ్యలా ఉంటాడే తప్ప తండ్రిగా అస్సలు కనిపించరు. నాగ్ ఎక్కడికి వెళ్లి కూడా ఆయన ఫిట్‌నెస్ సీక్రెట్ ఏంటనే ప్రశ్న ఎదురవుతూనే ఉంటుంది. ఇటీవల కూలీ సినిమా ప్రమోషన్స్ సమయంలో నాగార్జునని రజనీకాంత్ తెగ పొగిడేశారు. ఫిట్‌నెస్ సీక్రెట్ ఏంటని నేను అడిగితే వ్యాయామం చేయడమే అని నాకు చెప్పారు అని రజనీకాంత్ అన్నారు. అయితే తాజాగా కూలీ ప్రమోషన్స్ సమయంలో నాగార్జున తన ఫిట్‌నెస్ కి సంబంధించిన కొన్ని విషయాలు పంచుకున్నారు. ప్రతిరోజూ కనీసం 45 నిమిషాల నుంచి 1 గంట వరకు వ్యాయామం తప్పనిసరిగా చేస్తాను. ఏకకాలంలో ఒకే టైపు వర్కౌట్స్ కాకుండా ఓ రోజు వెయిట్ ట్రైనింగ్, మరో రోజు ట్రెడ్ మిల్ మీద రన్నింగ్, ఒక రోజు స్విమ్మింగ్, మరో రోజు వాకింగ్ ఇలా భిన్న రకాల వర్కౌట్స్ చేస్తూ శరీరానికి కొత్త ఉత్సాహం అందిస్తాను. వ్యాయామ సమయంలో ఫోన్ చూడను, మధ్యలో బ్రేక్స్ తీసుకోను. రోజులో 12 గంటల పాటు మాత్రమే ఆహారం తీసుకుంటాను, మిగతా 12 గంటలు ఉపవాసం ఉంటాను. ఉదయం పూట డైట్ ఏంటంటే.. కిమ్చి, ఉడికించిన క్యాబేజీ, బ్రొకోలి, కొద్దిగా కూరగాయ ముక్కలు, గోరువెచ్చిన నీరు, కాఫీ. మధ్యాహ్నం భోజనంలో పప్పు, కూర, పచ్చడి, నాన్‌వెజ్‌తో సంపూర్ణ భోజనం చేస్తాను. రాత్రి డిన్నర్ సాయంత్రం 7 - 7.30 మధ్యలో పూర్తి చేస్తాను..అందులో సలాడ్స్, చికెన్ లేదా ఫిష్ ఉంటాయి. స్వీట్స్ అంటే ఇష్టం. కానీ అధికంగా తినను. ఒక్కోసారి స్వీట్ తింటే, మరుసటి రోజు హెవీ వర్కవుట్ చేస్తాను.. లేట్ నైట్ షూటింగ్‌లు లేకపోతే ప్రతిరోజూ ఒకే టైంకి పడుకుంటాను. సెలబ్రిటీల జీవితంలో ఒత్తిడులు తప్పవు. కానీ అవసరం లేని విషయాల గురించి ఆలోచించొద్దు అని నా తండ్రి ఇచ్చిన సలహాని పాటిస్తుంటాను అని నాగార్జున స్పష్టం చేశారు. అయితే ఈ ఫిట్‌నెస్ సీక్రెట్స్ అనుసరించడం చాలా వరకూ సాధ్యమే. కాని ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చి, డిసిప్లిన్‌గా ఉంటేనే ఫలితం వస్తుంది. అందుకే ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండాలంటే సరైన డైట్, వ్యాయామం, నిద్ర ఈ మూడు మీ జీవితంలో భాగం చేయండి!

# ఓలే ఓలే గుంటా.. నీ ఒళ్లోకొచ్చీ పంటా..



అగ్ర హీరో రవితేజ 75వ సినిమా 'మాస్ జాతర' ఈ నెల 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. రచయిత భాను భోగవరపుని దర్శకుడిగా పరిచయం చేస్తూ సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఆడియన్స్‌లో అంచనాలు భారీగానే ఉన్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఈ సినిమా ప్రమోషన్‌ని మేకర్స్ వేగవంతం చేశారు. ఇందులో భాగంగా ఈ సినిమా నుంచి రెండో పాటను మంగళవారం విడుదల చేశారు. 'ఓలే ఓలే గుంటా.. నీ అయ్య కాడ ఉంటా.. నీయమ్మ కాడ తింటా.. నీ ఒళ్లొకొచ్చీ పంటా..' అంటూ సాగే ఈ ఊరమాస్ గీతాన్ని భాస్కర్ యాదవ్ రాయగా, భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. రోహిణి సోరట్ ఆలపించారు. థియేటర్లలో ప్రేక్షకులతో సెప్పులు వేయించేలా మంచి మాస్ బీట్‌తో ఈ పాట సాగింది. రవితేజ, శ్రీలీల జోడి ఈ పాటతో మాస్‌ని మరోసారి ఆకట్టుకుంటుందని, ఇద్దరూ పోటాపోటీగా నర్తించి పాటను మరోస్థాయిలో నిలబెట్టారని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి మాటలు: నందు సవిరిగాన, కెమెరా: విధు అయ్యన్న, సమర్పణ: శ్రీకర స్టూడియోస్, నిర్మాణం: సితార ఎంటైర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్.



# వెండితెరపై వెన్నెల..

నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదట్లో సీరియల్స్‌లో చిన్న చిన్న పాత్రలు పోషించింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో స్పెషల్ పాటలతో రచ్చ చేస్తుంది. ఇంతకీ ఈ అమ్మడు ఎవరో గుర్తుపట్టారా.? ఆమె మరెవరో కాదండి.. బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్. నాగిని సీరియల్ ద్వారా ఓ రేంజ్ క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ ఒక్క సీరియల్ ద్వారా ఓవర్ నైట్ స్టార్ అయిన ఈ అమ్మడు.. ఆ తర్వాత సోషల్ మీడియాలో గ్లామర్ ఫోజులతో మతిపోగొట్టేస్తుంది. నిత్యం ఏదోక క్రేజీ ఫోటో షేర్ చేస్తుంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన విశ్వంభర చిత్రంలో స్పెషల్ సాంగ్ చేస్తుంది. ఇందులో చిరుతో కలిసి స్టెప్పులేయనుంది. 5 నిమిషాలు ఉండే ఈ సాంగ్ కోసం ఏకంగా రూ. 50 లక్షలు పారితోషికం తీసుకుంటుందట. హిందీలో ఎక్కువగా పాపులర్ అయిన మౌనీ రాయ్.. ఇప్పుడు తెలుగులోకి ఎంట్రీ ఇస్తుంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన విశ్వంభర చిత్రంలో స్పెషల్ సాంగ్ చేస్తుంది. ఇందులో చిరుతో కలిసి స్టెప్పులేయనుంది. 5 నిమిషాలు ఉండే ఈ సాంగ్ కోసం ఏకంగా రూ. 50 లక్షలు పారితోషికం తీసుకుంటుందట. హిందీలో ఎక్కువగా పాపులర్ అయిన మౌనీ రాయ్.. ఇప్పుడు తెలుగులోకి ఎంట్రీ ఇస్తుంది. నిత్యం గ్లామర్ ఫోజులతో నెట్టింట మాయ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ పింక్ కలర్ శారీలో షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి. షాకింగ్ ఫిట్నెస్ లుక్ లో.. పింక్ శారీలో మ్యాజిక్ చేస్తుంది మౌనీ రాయ్. కెరీర్ తొలినాళ్లల్లో బ్యాగ్రౌండ్ డ్యాన్సర్ గా పనిచేసిన మౌనీ రాయ్.. ఇప్పుడు స్పెషల్ పాటలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది.



# అందంతో చంపేస్తుందిగా..

అందాల ముద్దుగుమ్మ ఐశ్వర్యా మీనన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. సినిమాలు చేసింది తక్కువే అయినా ఈ అమ్మడు పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తన అంద చందాలతో యూత్ ఫేవరెట్ అయిపోయింది ఈ బ్యూటీ. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామర్‌తో కుర్రకారు మనసు దోచేస్తుంటుంది. తాజాగా ఈ బ్యూటీ చిన్న సెల్ఫీతో కుర్రకారును ఆగం చేస్తుంది. మరి ఆ ఫొటోస్ మీరు కూడా చూసెయ్యండి. ఐశ్వర్యా మీనన్ తమిళంలో వరసగా సినిమాలు చేస్తూ మంచి ఫేమ్ సంపాదించుకుంది. తర్వాత ఈ చిన్నది నిఖిల్ స్పై మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. కానీ ఈ సినిమా హిట్ అందుకోకపోవడంతో ఈ బ్యూటీకి అంతగా గుర్తింపు రాలేదని చెప్పాలి. అంతే కాకుండా ఈ ముద్దుగుమ్మకు తెలుగులో అంతగా అవకాశాలు కూడా రాలేదు. ఈ సినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మ కార్తికేయ సరసన భజే వాయు వేగం సినిమాలో నటించి మెప్పించింది. కానీ ఈ మూవీ కూడా డిజాస్టర్ అయ్యింది. దీంతో ఈ నటి తెలుగులో ఎక్కువ సినిమాల్లో అవకాశాలు అందుకోలేకపోయింది. ఇక మూవీస్ లేకపోయినా ఈ బ్యూటీకి టాలీవుడ్‌లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుంది. సోషల్ మీడియా ద్వారా యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. తాజాగా ఈ అమ్మడు తన ఇన్ స్టాలో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో ఈ అమ్మడు అందాలు చూస్తే మతి పోవాల్సిందే. సెల్ఫీలో తన క్యూట్ నెస్‌తో అందరినీ ఆకట్టుకుంది. అందులో ఈ బ్యూటీని చూసి కుర్రకారు ఫిదా అయిపోతున్నారు.

# అగరం ఫౌండేషన్ ద్వారా ఇంత మంది డాక్టర్స్, ఇంజనీర్స్ అయ్యారా.. ఎమోషనల్ అయిన సూర్య







కోలీవుడ్ స్టార్ హీరో సూర్య గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. స్టార్ నటుడిగా, మంచి మనసున్న వ్యక్తిగా ఆయనకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ ఫ్యాన్ బేస్ ఉంది. అయితే గత కొంతకాలంగా బాక్సాఫీస్ పరంగా విజయాలేమీ లేకపోయినా, సామాజిక సేవలో మాత్రం సూర్య అగ్రస్థానంలో నిలుస్తున్నారు.

ఇందుకు ప్రధాన ఉదాహరణగా నిలిచింది ఆయన స్థాపించిన అగరం ఫౌండేషన్ . 2008లో ప్రారంభమైన అగరం ఫౌండేషన్ ఈ ఏడాది 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం చెన్నైలో గ్రాండ్ సెలబ్రేషన్ నిర్వహించారు. ఈ వేడుకకు సూర్యతో పాటు అతని భార్య జ్యోతిక, సోదరుడు కార్తీ, ప్రముఖ నటుడు కమల్ హాసన్, దర్శకుడు వెట్రిమారన్ తదితరులు హాజరయ్యారు. ఈ వేడుకలో అగరం ఫౌండేషన్ సాయంతో చదువు పూర్తి చేసిన విద్యార్థులు స్టేజ్ పైకి వచ్చారు. ఇప్పటివరకు దాదాపు 8000 మంది విద్యార్థులు అగరం సాయంతో విద్యను పూర్తి చేసుకోగా, వీరిలో 1800 మంది ఇంజినీర్లు , 51 మంది డాక్టర్లు ఉన్నారు. ఈ ఫౌండేషన్ వల్ల తమ జీవితాలు ఎలా మారిపోయాయో అందరూ వేదికపై భావోద్వేగంతో పంచుకున్నారు. ఆ క్షణంలో హీరో సూర్య ఎమోషనల్ అయ్యారు. కన్నీళ్లను ఆపుకోలేకపోయారు. ఈ సన్నివేశం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు, నెటిజన్లు సూర్య చేస్తున్న సేవను కొనియాడుతూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

అగరం ఫౌండేషన్ ప్రత్యేకత ఏమిటంటే, పేదలుగా, అనాథలుగా ఉన్న చిన్నారులను ఎంపిక చేసి వారికి కెజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించడం. ఇందుకోసం సూర్య కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అంతేకాదు, తన ఇంటినే అగరం స్కూల్‌కి కేటాయించడం కూడా ఆయన గొప్ప మనసుకే నిదర్శనం. సినిమాల్లో విజయాలు, వైఫల్యాలు వస్తూ పోతూ ఉంటాయి. కానీ.. ఒక మంచి మనిషి చేయగలిగిన మార్పు మాత్రం చరిత్రలో నిలిచిపోతుంది. సూర్య చేస్తోన్న ఈ సేవ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుంది . అగరం ఫౌండేషన్ ద్వారా వెలుగులోకి వచ్చిన వేలాది విద్యార్థుల జీవితాల గురించి తెలుసుకొని ప్రతి ఒక్కరు సూర్యపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com